# కాలజ్ఞానసుధ

ఆధ్యాత్మిక మాస పత్రిక

ఫిబ్రవరి - 2015 సంపుటి: 19 సంచిక: 2




**ఈ నెల సూక్తి**

నీవు కూడా చేయగలిగిన మంచిని కొంత వాయిదా వేసి అయినా చెయ్యి. కానీ, నీవు మాత్రమే చేయగలిగిన మంచిని వెంటనే చెయ్యి. ఏ వైద్యానికీ పనికిరాని మొక్క లేనట్లే ఏ పనీ చేతగాని మనిషి ఈ ప్రపంచంలో ఉండడు.



## విషయ సూచిక


| | |
|---|---|
| సంపాదకీయం - సమత్వాన్ని సంతరించుకోండి! | 4 |
| జ్ఞాన సుధ - కుల స్త్రీ | 7 |
| వేద పరిచయము - ఋగ్వేద పరిచయం | 8 |
| అవతారపురుషుడు | 10 |
| వీరకాళికాంబా శతకం - విగ్రహ పూజ | 12 |
| నైతిక విలువలు | 15 |
| శ్రీ గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రుల కళ్యాణము | 18 |
| భారతీయ ప్రతిభా పాటవాలు -యంత్ర శాస్త్రం | 22 |
| రఘువంశం | 23 |
| త్రిమూర్త్యాత్మక అవతారం దత్తాత్రేయస్వామి | 26 |
| సనాతన ధర్మము - దాని విశిష్టత (విధ్యుక్త కర్మాచరణ) | 28 |
| యోగవాసిష్ట కథాలహరి-భోగయోగ సీమా భూమి భార్గవులు | 29 |
| భగవద్గీతకు భాసురభాష్యం | 31 |
| అష్ట వినాయకులు - (విఘ్నరాజ) | 33 |
| దర్శనీయ దేవాలయాలు (మడ అడవులు) | 34 |
| నియమ నిష్ఠలు | 36 |
| వివిధ వ్యాధులు ఆయుర్వేద చికిత్సలు | 38 |


ముఖచిత్రం: ఈశ్వరుడు


**చందా వివరములు**

జీవిత చందా(20సం॥) : 1116/-
సంవత్సర చందా : 70/-



చందాలు పంప వలసిన చిరునామా:

**కాలజ్ఞాన సుధ**

శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,
ఒంగోలు - 523 002 ప్రకాశం జిల్లా, (ఆం. ప్ర)
ఫోన్స్: 08592/235341, 9949132469,
9705555229, 8977799289

సంపాదకులు: శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారు

సంపాదకీయం

# సమత్వాన్ని సంతరించుకోండి

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి బోధనలను గ్రహించినట్లైతే ఎంతో వైవిధ్యంగా కనిపిస్తాయి. తాత్వికంగా తత్త్వరహస్యాన్ని గ్రహించిన వారంతా బ్రహ్మవేత్తలేనన్నారు. కుల, మత వ్యత్యాసాలతో పనిలేకుండా తన్నుతాను గ్రహించి, తను తానైనవాడే బ్రహ్మవేత్త అన్నారు. అంటే మానవ బలహీనతలన్నింటిని అధిగమించి నిగ్రహంతో దైవానుగ్రహాన్ని సంపూర్ణంగా పొందిన ధీశాలులనే బ్రహ్మవేత్తలని నొక్కి వక్కాణించారు.

ఆధ్యాత్మిక చింతనతో వుంటూ సాటిమానవుల కష్టనష్టాలను పట్టించుకోని వారికి పరమాత్మ అనుగ్రహం లభించదని స్పష్టంగా బోధించారు.

సాటిమానవులకు సాయము పడుబోక....... అంటూ 291వ పద్యం ద్వారా సుస్పష్టం చేశారు. మానవులంతా ఒక్కటే హెచ్చుతగ్గులుకూడవు అని నినదించారు. పుట్టుకతో ఎవరూ యజ్ఞోపవీతంతో పుట్టలేదని, తల్లి గర్భం నుండి భూపతనమైన ప్రతి బిడ్డ యోని సంభువుడేనని, పుట్టుకలో లేని హెచ్చుతగ్గులు తరువాత ఎలా వచ్చినట్లు ? మేము గొప్పవారము, మాది గొప్ప కులము, మా మతము గొప్పది అనే వారికి స్వామివారిచే సూటిగా సంధించబడిన ప్రశ్న ఇది.

పుట్టుకతో ప్రతివారు సూద్రులేనని ఆ తరువాత రకరకాల ప్రక్రియలతో కులమతాల వ్యత్యాసాలను సృష్టించారని తద్వారా కలసి బ్రతుకవలసిన మానవాళి విడిపోయి విభేదాలతో చరిస్తున్నారు.

**700. కులమతాల జాడ్యములలోన దపియించు**
**దీనజనుల సేద దేర్చువాడ**
**మానవుండే ధరను మాధవుండనువాడే**
**కాళికాంబ! హంస! కాళికాంబ**

అంటూ స్వామివారు తన విధాన మేమిటో స్పష్టంగా చెప్పారు.

"క్రమము దప్పవేళ కష్టజీవులపైన...." అంటూ 141వ పద్యంలో కర్షకులను అనగా రైతులను గురించి చెప్పారు. రాత్రింబగళ్ళు కష్టించి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అనేక వ్యయప్రయాసల కూర్చి పంటను పండించి, కుప్పలు నూర్చి, మనకందరికి ఆహారాన్నధిస్తున్నది రైతువర్గం. అలాంటి వారిని పట్టించుకునేవారె కరువైనారని రైతును పట్టించుకొని రాజ్యాలు సుభిక్షంగా వుండవని చెప్పారు. వారిని ఆదరిస్తే సమాజం చల్లగా సాగిపోతుంది. అని

హితవు చెప్పారు స్వామి. కుల, మతాల లంపటాల వదలి అందరూ కలసి బ్రతకండనేది స్వామివారి సందేశం.

మూడు యుగములందు ముదితలు ముగ్ధలు ... -199 పద్యం అంటూ గత కాలంలో స్త్రీని అణగదొక్కారని, కలియుగంలో వారె శాసన కర్తలవుతారని చెప్పారు. అలాగే నేడు స్త్రీ జాతి చేతికి రాజ్యాధికారం లభించిన విషయం విదితమే! ఎచ్చట స్త్రీ గౌరవించబడుతుందో అచ్చట అన్ని సుభిక్షంగా వుంటాయని స్వామివారు చెప్పారు.

వెరసి స్త్రీ పురుష బేధంగాని, కుల, మత, వ్యత్యాసంకాని వుండరాదని అందరూ కలసి (ఎవరి పని వారు చేసుకుంటూ) ప్రేమ తత్వంతో జీవించే సమాజాన్ని తాను ప్రతిపాధిస్తున్నానని నిర్వందంగా చెప్పారు.

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారు మహమ్మదీయుడైన సిద్దయ్యను శిష్యునిగా స్వీకరించి ఆదరించారు. అతనిని తన తత్వానికి వారసుని చేశారు. హరిజనుడైన కక్కయ్యను అతని భార్యకు షడ్చక్ర దర్శనం చేయించి బ్రహ్మవిద్యకు కులం కన్నా విశ్వాసమే ముఖ్యమని చాటి చెప్పాడు. తన తల్లియైన అక్కనాగమ్మకు బ్రహ్మోపదేశం చేసి బ్రహ్మవిద్య నభ్యసించుటకు స్త్రీ పురుష బేధం అడ్డురాదని తేల్చి చెప్పారు. సర్వమానవులను సమంగా ప్రేమించి తన ఔన్నత్యాన్ని చాటు కోవాలని, అందరూ అన్ని విషయాలకు అర్హులను చేయాలని తెగేసి చెప్పారు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి. మనం స్వామివారి వారసులం కావాలంటే తరతమ బేధాలను ప్రక్కన పెట్టాలి. సమాజమంతా వసుధైక కుటుంబమని చాటి చెప్పాలి. ఆచరించి చూపాలి. అలాంటివారే అసలైన వీరబ్రహ్మేంద్రుని విధేయ భక్తులు సుమా!

భగవత్సేవలో.....

- చెఱకు గడలోని మాధుర్యాన్ని రుచిచూడాలంటే ముందు దానిపై నున్న బెరడును లాగి అవతల పారవెయ్యాలి. ఇలా తీసేటప్పుడు పళ్లలో పీచులు ఇరుక్కోవచ్చు. లేదా నాలుక తెగనూ వచ్చు. అలాగే భగవంతుని గొప్పతనాన్ని భగవతత్త్వంలోని మాధుర్యాన్ని గుర్తించటానికి ముందు భక్తులు కూడా కొన్ని కష్టాలను అనుభవించవలసి రావచ్చు.
- సంకల్పాలతో కూడిన మనస్సు గాలిలో పెట్టిన దీపం లాంటిది. అది స్థిరంగా ఉండదు. ఈ దేహం నుండి దూరంగా పారిపోవడానికే ప్రయత్నిస్తుంది. దానికి తపస్సు అనే అడ్డుగోడను కడితే తప్ప మన అధీనంలో ఉండదు.



# పేద విద్యార్థులకు ఉచిత విద్య



శ్రీ అచలానంద ఆశ్రమము చారిటబుల్ ట్రస్ట్, ఒంగోలు వారి ద్వారా పేద విద్యార్థులకు గత 10 సంవత్సరాలుగా ఉచిత విద్య అందించబడుచున్న విషయం అందరికి తెలిసిన విదితమే.

జ్ఞానదానం, అన్నదానం, విద్యాదానం, వైద్యదానం అనేవి పూజ్యాపాద శ్రీశ్రీశ్రీ 'యోగి' అచలానందస్వామి వారి సంకల్పం. అందులో భాగంగానే ప్రస్తుతం ఒంగోలులోను, తోట్లపల్లి గ్రామము శ్రీ బ్రహ్మంగారి మఠం మండలంలోను శ్రీ అచలానంద ఆశ్రమము ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అన్నదానము, విద్యాదానము జరుగుచున్నవి. జ్ఞానదానం అనేది ఆశ్రమ ప్రచురణల ద్వారా, సత్సంగముల ద్వారానూ, ధ్యాన యోగాభ్యాసం ద్వారాను జరుగుచున్నది. వైద్యదానం ప్రస్తుతం పేద వృద్ధులకు నేత్ర వైద్యం, మందులను ఇప్పించుట ద్వారా పాక్షికంగా జరుగుచున్నది. పై కార్యక్రమములన్ని దాతల సహకారంతో జరుగుచున్నవి. ప్రస్తుతం ఆశ్రమములో 20 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ సంవత్సరము మరికొంత మంది విద్యార్థులను స్వీకరించదలచి ఆహ్వానిస్తున్నాము.

తేది 28-4-2015 న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారా ఆరాధన పర్వదినం రోజున ఈ పరీక్షకు హాజరుకాదలచిన విద్యార్థులు ముందుగా ఆశ్రమములో మీ పేరును నమోదు చేసుకోవాలి.

6,7,8 తరగతి చదువ వలసిన పేద విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఒంగోలు, శ్రీ అచలానంద ఆశ్రమమునందు ఈ పరీక్షలు నిర్వహించబడును. పరీక్ష హాజరు కాగోరిన విద్యార్థులు తేది 25-4-2015 శనివారం ఒంగోలు ఆశ్రమమునకు చేరుకొనగలరు. కుల, మత, ప్రాంత భేదాలులేకుండా ఈ పరీక్ష నిర్వహించబడును

## శ్రీ అచలానంద ఆశ్రమము ఛారిటబుల్ ట్రస్ట్

శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,
ఒంగోలు - 523 002 ప్రకాశం జిల్లా, (ఆం. ప్ర)
ఫోన్స్ : 08592/ 235341, 9949132469, 97035 87035

జ్ఞాన సుధ

# కులస్త్రీ

సహజ కవి వి. శ్రీరామరెడ్డి

**వాణియు, శర్వాణియు, హరిరాణియు వాక్కునను మైనురంబున నుంటల్ రాణఁదిలకించి మదిలో బాణిగ్రాహి యెడ నిల్పు భక్తి కుమారీ!**

సరస్వతీదేవి నాలుకపై, పార్వతీదేవి సగభాగమై, లక్ష్మీదేవి వక్షస్థలమందు కొలువుదీరి వారిపతులకు తోడునీడగా వున్నట్లే, నీవు నీ భర్తపట్ల ఎప్పుడూ గౌరవాన్ని ప్రేమను పంచుతూ కష్టసుఖాల్లో అతనికి తోడునీడలా ఉండాలి, అని తల్లి కుమార్తెను అత్తగారింటికి పంపునపుడు ఇలా నీతులు చెప్పి పంపిస్తుందని శాస్త్ర వచనం.

అనగా అనగా ఒక బ్రహ్మచారి, మంచి యవ్వనంలో నున్నాడు. శాస్త్ర పరిజ్ఞానం బాగా వంటబట్టింది. ఎంతో శ్రద్ధాసక్తితో ధర్మశాస్త్రాలకు భాష్యం రాయాలని కూర్చున్నాడు. ఆ యింటిలో ఉన్నదల్లా తల్లి ఒక్కతే. ఆమెకూడా వృద్ధురాలైనది. వారికి పెద్దలు సంపాదించిన ఆస్తులేవీలేవు. ఏ కూలినాలియో జేసి తల్లి ఇల్లు గడుపుతున్నది. ఉన్నట్టుండి ఓ రోజు ఆమెకు సుస్తిజేసినది. వళ్ళంతా నొప్పులు నాలుగురోజులు తేరుకోలేకపోయింది. తన వృద్ధాప్యంజూసి ఒక నిర్ణయాని కొచ్చిన ఆమె పొరుగూరికిపోయి కోడలిని ఎంపికజేసింది. తల్లిపట్ల విధేయుడైన ఆ కుమారుడు ఆ ఊరికిపోయి ఆ అమ్మాయిని వివాహమాడాడు. వివాహమయిన తరువాతకూడా లేఖన, పఠన కార్యక్రమాలలో తలమునకలుగానే ఉన్నాడు. వయసులోనున్న పెళ్ళాం గురించి మరచిపోయాడు. అతని ఏకాగ్రత అటువంటిది. కొన్నాళ్ళకు అతని తల్లి చనిపోయింది. విషయం తెలిసి భార్య తనకైతాను భర్త ఇంటికొచ్చింది. ఇంటిలో ఏమియులేవు. భర్త పరిస్థితి అర్థం జేసుకొన్న ఆ ఇల్లాలు బైట చాకిరిచేసి, డబ్బుసంపాదించి, కుమారునకు ఆ తల్లివండిపెట్టినట్లు సేవలు చేస్తున్నది. యధావిధిగా ఆ ముని తనరచన సాగిస్తున్నారు. ఏండ్లు గడచిపోయాయి. ఒక రాత్రి కాలంలో మునిగారు తనురాయదలచుకొన్న విషయం చివరగీత రాయడం ముగించాడు. ఈ లోకంలోకొచ్చి ఇంటినంతా కలయజూశాడు. ఒక ముసలావిడ చాపపై పడుకొని నిద్రబోతున్నది. అది గమనించి, దగ్గరికొచ్చి పరిశీలనగా చూశాడు. ముఖం ఎప్పుడో చూసినట్లున్నది... కానీ ఆ స్త్రీ ఎవరో గుర్తుకు రాలేదు. ఎవరామె ? నిద్రలేపాడు, అమ్మా ఎవరు మీరు ? ఇక్కడి కెప్పుడొచ్చారు. ఎందుకు వచ్చారు, ఈ విధంగా ప్రశ్నించాడు ముని. అందుకావిడ చాలా వినయంతో ఈ విధముగా సమాధానం చెప్పింది.

స్వామినేను మీ భార్యను. మీ తల్లి చనిపోయినప్పటి నుంచి మీ సేవ చేస్తున్నది నేనే. నలభై సంవత్సరాలుగా మీతో వుంటున్నాను. మునిగారు అవాక్కయ్యారు తనకళ్ళను తానే నమ్మలేకపోయారు. ఇంట్లో తనకోసం ఒక ఆడమనిషి ఇంతగా శ్రమిస్తుండడం తను గమనించనేలేదు. నీ పేరేమిటి ? అడిగాడు

తరువాయి 9వ పేజిలో......

# వేద పరిచయము

.......... ఆచార్య డా॥ మట్టి కృష్ణారెడ్డి ............

## ఋగ్వేద పరిచయము

**మొదటి మండలం**

ఈ మొదటి మండలంలో 191 సూక్తాలు, 1976 మంత్రాలు ఉన్నాయి. మొదటి మండలములో ఒక్కొక్క ఋషి దర్శించిన సూక్తాలను ఒక్కొక్క సముదాయంగా స్వీకరించి, అటువంటివి 14 సూక్త సముదాయాలుగా కూర్చబడినాయి. ఈ సూక్త సముదాయాలలో సూక్తాలను అమర్చడం ఆయా సూక్తాలలో స్తుతించబడే దేవతలను అనుసరించి చేయబడింది. 11 సూక్తాలున్న మొదటి సూక్త సముదాయంలో - మొదటిది అగ్నిని - రెండు వాయువును - మూడు అశ్వినులను మరియు ఇంద్రుని, నాలుగు నుండి 11వ సూక్తం వరకు ఇంద్రుని స్తుతిస్తున్నాయి. ఈ విధంగా ఋషి మండలాలను అమర్చిన క్రమంలో, సూక్త సముదాయాలను కూడా అమర్చారు.

మొదటి మండలములో భగవదన్వేషణ, ఆరాధన సమున్నత మార్గమని తెలియజేయబడింది. వైదిక విజ్ఞానమార్గమైన దర్శనం ప్రపంచంలోని ప్రతివ్యక్తినీ గౌరవించడాన్ని ప్రబోధిస్తుంది. విజ్ఞులైన పెద్దలకు, పిన్నలకు, యువతకు, వృద్ధులకు నమస్కరించడం సముచితమని తెలియజేస్తున్నది. భగవత్స్వరూపం వాచామగోచరమని చెప్పి, అణువు నుండి అజాండమంతా వ్యాపించిన విరాడ్రూపుని గాంభీర్యం అద్వితీయంగా కీర్తించింది. ఆ సర్వేశ్వరుడు సర్వకాలాలలో భూలోకద్యులోకాలలో ఉండే సమస్త ప్రాణులను ఉద్ధరిస్తున్నాడు. తన నుండి సృజింపబడ్డ ఈ లోకాన్ని రక్షించడమే కర్తవ్యంగా భావిస్తున్నాడు. ఈ భూమిమీద పుట్టిన ప్రాణులు కానీ లేదా పదితో గుణిస్తే ఎంత మందో అంతమంది పరమాత్మ గొప్పతనాన్ని కీర్తించలేరు. సర్వేశ్వరుని శక్తి, జ్ఞానం, పరాక్రమం అమేయమైనవి. భగవదధీనమైన ఈ సృష్టితత్త్వం, భగవతత్త్వం రెండూ వేదం పైనే ఆధారపడి ఉన్నాయి. జగత్తు, ఈశ్వరుడు వేద రక్షకులు. జీవుడు దేవుడు రెండు పక్షులై, జగత్తు అనే వృక్షంపై విభిన్నంగా విరాజిల్లుతున్నారు. అంతటా వ్యాపించి ఉండే ఈశ్వరునిలాగా వేదం కూడా అన్ని చోట్ల వ్యాపించి ఉంటుంది. అనేక శబ్దాలు గల ఈ శృతి అనేక విధ నిగూఢార్థాలతో నిండి ఉంది. ఈ జగత్తు శృతివల్లే జీవిస్తున్నది.

ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవడమే జీవితానికి ముఖ్యమనే భావన ఇందులో ఉంది. కాలమనే చక్రానికి 12 ఆకులు (నెలలు) ఉన్నాయి. నిరంతరం తిరుగుతూ ఉండే ఈ చక్రానికి ఏడు వందల ఇరువై మంది కొడుకులు (360+360=720 పగళ్ళు, రాత్రులు) ఉన్నారు. ఈ విధంగా ఆత్మతత్త్వాన్ని వేదపవిత్రతను ప్రథమ మండలం తెలియజేస్తున్నది.

**రెండవ మండలం**

రెండవ మండలంలో 43 సూక్తములు, 429 మంత్రములున్నవి. ఇందులో సమాజానికి మంచిని ప్రసాదించమన్న ప్రార్థనలు ఉన్నాయి. మాకు మంచి సంపదలనివ్వు. మాకు కర్తవ్యబోధకుడివై, సన్నిహితుడివై ఐహిక సుఖాలను ఆముష్మిక

సంపదలను ప్రసాదించు. అక్షయసంపదలతో, చక్కని వాక్కుతో మేము ప్రతి రోజు మంచి రోజుగా భావించేట్టు చెయ్యి అని వేడుకోవటం ఇందులో ప్రధానాంశం. ఆత్మసమర్పణంలో - పాపం, భయం, ఆపద, నాశం, శత్రువులు, చెడుమిత్రులను తొలగించమని భగవంతుని ప్రార్థించడం కూడా ముఖ్యమైన అంశం. సర్వేశ్వరుడు అన్ని విధాలైన ఉపద్రవాలను పోగొడుతాడు. భగవంతుడుని అనుగ్రహం కలవానికి ఎటువైపునుంచి కూడా ఎలాంటి భయం కలుగదు. వానికి అన్ని సుఖాలే కలుగుతాయి. ఓ ఈశ్వరా! నీవు శత్రు నాశకుడవు. మాకు అభయాన్నివ్వు. అజ్ఞానాన్ని దూరంచేసి, సుజ్ఞానమార్గంలో నడిపించమని, బృహస్పతి స్వరూపుడైన పరమాత్మను అర్థిస్తూ మనస్సును అర్పించాలన్న సారాంశం ప్రార్థనారూపాలైన పలుమంత్రాలలో గోచరిస్తుంది.

**మూడవ మండలం**

మూడవ మండలములో 62 సూక్తాలు, 617 మంత్రములు ఉన్నవి. ఇందులో భగవంతుని అగ్నిస్వరూపునిగా దర్శించి సర్వరక్షకుడుగా కీర్తించడం ప్రధానాంశం. సర్వశక్తి స్వరూపుడైన భగవంతుని అన్ని దిక్కులలో ఉన్న క్రూరస్వభావం గలవారిని సమూలంగా నాశనం చెయ్యమని ప్రార్థించడం, మంచి లక్షణంగల శిష్యులందరినీ యథాయోగ్యంగా పరిరక్షించాలనే మంత్రాలు ప్రధానంగా మూడవ మండలంలో విరాజిల్లుతున్నాయి.

---

**7 వ పేజి తరువాయి ......**

మర్యాదపూర్వకంగా, నా పేరు భామతి అని చెప్పిందామె. వెంటనే ఆతడు కలం తీసుకొని తనువ్రాసిన గ్రంథానికి "భామతి" అని పేరు బెట్టాడు.

ఈ కలికాలంలో భామలెందరో ఉన్నారు గానీ, భామతులకు మాత్రం కొదవేనని చెప్పాలి. అట్టివారిని కేవలం వ్రేళ్ళమీదే లెక్కపెట్టవచ్చునేమో పురాణ కాలంలో వీరిపాత్ర విరివిగానే సాగినది. సీత, సావిత్రి, అనసూయా, అహల్యా, మండోదరి, చంద్రమతి, ద్రౌపది ఇలా ఎందరో సతీమతల్లులు మన పుణ్యభూమిలో సమతుల్యంగా తమ పాత్రను పోషించారు. వీరంతా పతియే దైవమని భావించి తమ జీవితాలను చరితార్థం చేసుకొన్నారు. చరిత్రలో స్థిరస్థాయిగా నిలచిపోయారు. కులం, వంశము, సమాజ వ్యవస్థ, కుటుంబ గౌరవం, కుల స్త్రీ ఆదరణ మీదనే నిలబడుతుందని పెద్దల వాక్యం. ఈనాడు పరదేశీ సంస్కృతికి ప్రాధాన్యతనిస్తూ కుటుంబవ్యవస్థ, సమాజ గౌరవం, మట్టిలో కలసిపోతున్నవి, సినిమా, దూరదర్శన్‌ల పిచ్చి వ్యామోహముగా మారి, దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్నవి. అజ్ఞానులు పోనిచ్చి డిగ్రీలు, పట్టాలు తీసుకొన్నవారు కూడా ఆ వ్యామోహంలో పయనిస్తూ చాలామట్టుకు సమాజాన్ని దెబ్బదీస్తున్నారు. తరచిచూస్తే మన హిందూసాంప్రదాయానికే వినాశాన్ని తెచ్చి పెడుతున్నారు. ముఖ్యముగా విదేశీ వస్త్రధారణ చాలామట్టుకు మన సాంప్రదాయంమీద దెబ్బతీసిందని చెప్పవలయును. వీటన్నిటికి మూలం విజ్ఞాన లోపమే. పాశ్చాత్యచదువులకు ప్రాధాన్యతనిస్తూ, మన ప్రజ్ఞాపాటవాల్ని కోల్పోయి, అంధకారములో పయనిస్తున్నారు. అందరూ మేల్కొని ఈ విపత్కర ప్రమాదం నుండి బయటబడి సమాజ శ్రేయస్సుకు ఎవరిమట్టుకువారు శ్రద్ధతీసుకొన్ననాడే మనదేశం బాగుపడగలదని "వివేకానందుడు" ఈ సత్యాన్ని విశదపరచాడు, కానీ ఆ విధానమున ఆలోచించువారు కరువయ్యారు, హతోస్మి!



## అవతారపురుషుడు

# శ్రీ రామకృష్ణ పరమహంస

................................ ములుకుట్ల సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, ఒంగోలు ................................

**పవిత్రం చరితం యస్య పవిత్రం జీవనం తథా।**
**పవిత్రాయ స్వరూపాయ నమస్తస్మై నమోనమః॥**

ఎవరి జీవనం, చరిత్ర పవిత్రమో, ఎవరు మూర్తీభవించిన పవిత్రతయో అట్టి మహనీయునకు శ్రీరామకృష్ణ పరమహంసకు అనేక నమస్కారాలు.

భారతదేశం పుణ్యభూమి, కర్మభూమి, తపోభూమి ఈ గడ్డపై ఎందరో మహనీయులు అవతరించి సనాతనధర్మాన్ని ఉజ్జీవింప చేశారు. వారిలో శ్రీరామకృష్ణపరమహంస ఒకరు.

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని హుగ్లీ జిల్లాలో కామార్పుకూర్ గ్రామంలో పుణ్యదంపతులైన క్షుదిరామ్-చంద్ర మణీదేవిలకు 1836వ సంవత్సరం ఫిబ్రవరి 18వ తేది సూర్యోదయానికి ముందు శుభముహూర్తంలో జన్మించారు.

క్షుదిరామ్ పుణ్యక్షేత్ర సందర్శనలలో ఉండగా 'గయ' క్షేత్రంలో కలిగిన దివ్యానుభూతివలన ఆ క్షేత్ర అధిదైవం నారాయణుని పేరైన 'గదాధర్'అని నామకరణం చేశాడు.

'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది' అన్నట్లు గదాధరునిలో భగవద్భక్తి, ధ్యాననిష్ఠ, జీవకారుణ్యం వ్యక్తమైనాయి.

అద్భుత జ్ఞాపకశక్తి, మధురగానం, చిత్రలేఖనం, ముత్యాలవంటి చేతిదస్తూరి, ఆకర్షణ అతని సొంతం.

ఏడవ ఏట వరి పొలంగట్టుమీద మరమరాలు నములుతూ నడుస్తుండగా ఆకాశంలో దట్టమైన నల్లని వర్షమేఘం కమ్ముకోవటం, తెల్లని కొంగలబారు ఆ మేఘాల క్రింద నుండి వేగంగా ఎగురుకుంటూ పోవడం చూచి భగవదనుభూతిని పొంది భావసమాధి కలిగింది.

మరోసారి విశాలాక్షి దేవాలయంలో అమ్మ నామసంకీర్తన చేస్తూ దివ్యానుభూతి పొందాడు.

1843వ సంవత్సరంలో తండ్రి ఆకస్మికమరణం గదాధర్‌ను అంతర్ముఖం చేసింది.

భగవదనుభవం అంటూ చదువుపట్ల నిర్లక్ష్యంగా ఉన్నాడని అన్న రామ్‌కుమార్ మందలిస్తే -అన్నయ్యా! బియ్యం, అరటికాయలు మూటలు కట్టే పొట్టకూటి చదువు నాకు అక్కర్లేదు. ఏ విద్య హృదయవికాసాన్ని కలిగించి, కోరికలకు అతీతమైన ఆధ్యాత్మిక సంతృప్తిని కలిగిస్తుందో ఆ విద్యనే అభ్యసిస్తానని స్పష్టంగా బదులిచ్చాడు.

1855 దక్షిణేశ్వరంలో కాళీమాత ఆలయంలో అన్నగారైన రామ్‌కుమార్‌కు సహాయ అర్చకునిగా చేరి, తన సాధనలను తీవ్రతరం చేసాడు. దేవీ విగ్రహాన్ని సజీవమూర్తిగా భావించి ఆరాధన చేసేవాడు. విగ్రహంతో మాట్లాడేవాడు. అన్నం నోట్లో పెట్టేవాడు. దేవాలయ సిబ్బంది యజమానురాలైన రాణిరాస్మణికి, ఆమె అల్లుడు మధురనాథ్ విశ్వాస్‌కి ఫిర్యాదు చేస్తే వారు స్వయంగా పరిశీలించి, అది తీవ్ర భక్తి పారవశ్య స్థితిగా భావించి నమస్కరించారు.

పూలమాలకడుతూ న్యాయస్థానంలో ఉన్న ఆస్తివివాదాల గురించి ఆలోచిస్తుంటే రాణిరాస్మణి

చెంపపై కొట్టి కర్తవ్యబోధ్ చేశారు.

1859లో రామచంద్రముఖర్జీ శ్యామసుందరీ దంపతుల కుమార్తె అయిన శారదతో వివాహం జరిగింది.

1861లో భైరవీబ్రాహ్మణి అనే తాంత్రిక గురువు రాకతో శ్రీరామకృష్ణుల సాధన తీవ్ర స్థాయి ని చేరింది.

శ్రీకాళీమాత దర్శనం కోనం విలపించి అమ్మదర్శనం పొందారు. 1868లో వైద్యనాథం, కాశీ, బృందావనం, త్రివేణీనంగమం మొదలైన పుణ్యక్షేత్రాలు దర్శించారు.

కాశిలో నడిచేకాశీవిశ్వనాధునిగా పేరుగాంచిన శ్రీ త్రైలింగస్వామివారి సాంగత్యం పొందారు.

మణికర్ణికా ఘాట్‌లో పొడగరీ పింగళవర్ణ జటాదారీ, శ్వేతకాయుడు అయిన పురుషుడొకడు గంభీరంగా నడుస్తూ స్మశానంలోని ప్రతి చితివద్దకూ వెళ్లి, ఒక్క జీవుని చెవిలో తారకమంత్రోపదేశం చేస్తున్న దృశ్యం దర్శించారు.

బృందావనంలో శ్రీరాధాకృష్ణుల దర్శనం పొందారు.

తన తపశ్శక్తిని ధారపోసి స్వామీ వివేకానంద వంటి జాతిరత్నాలను దేశానికి అందించారు.

లోకానికి ఆదర్శమూర్తిగా, జాతిమత సమైక్యతను ప్రపంచానికి తెలియచెప్పిన మహనీయుడు 1886 ఆగష్టు 16న ఈ లోకాన్ని వీడి పరబ్రహ్మైక్యం చెందారు.

**శ్రీరామకృష్ణుల ఉపదేశాలు**

1. దుర్లభమైన మానవజన్మ పొందికూడా భగవంతుని కోసం ప్రయత్నించని వాని జన్మ నిరర్థకము.

2. ఎవరి ఏకాగ్రత, వ్యాకులత తీవ్రతరమైనదో వారు భగవంతుణ్ణి శీఘ్రంగా దర్శిస్తారు.

3. పడవ నీళ్ళలో ఉండవచ్చుకానీ పడవలో నీళ్లు ఉండరాదు. సాధకుడు సంసారంలో ఉండవచ్చు. కానీ సంసారాసక్తి అతడిలో ఉండకూడదు.

4. మీకు మనశ్శాంతి కలగాలంటే ఇతరులలో దోషాలను చూడకు, నీలోపాలు గుర్తించు. ప్రపంచమంతా నీదేననే భావన పెంచుకో. అందరూ భగవత్స్వరూపాలే.

5. మానవహృదయం పరబ్రహ్మాభిముఖమై ఉన్నంతకాలం అతడు నంసార సాగరంలో దారితప్పిపోడు.

(ఫిబ్రవరి 18 శ్రీరామకృష్ణుల జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం) - సంపాదకుడు

- ఆకాశంలో ఎగిరే గ్రద్ద దృష్టి అంతా కుళ్లు కంపు కొట్టే కళేబరాల పైనే ఉంటుంది తప్ప ప్రక్కన పంచభక్ష్య పరమాన్నాలున్నా పట్టించుకోదు. అలాగే అజ్ఞానాంధకారంలో జీవించడానికి అలవాటుపడిన మనిషికి విషయ వాంఛలలో కనిపించిన సుఖం వేదాంత విషయాలలో కనిపించదు.
- నీవు కూడా చేయగలిగిన మంచిని కొంత వాయిదా వేసి అయినా చెయ్యి. కానీ, నీవు మాత్రమే చేయగలిగిన మంచిని వెంటనే చెయ్యి. ఏ వైద్యానికీ పనికిరాని మొక్క లేనట్లే ఏ పనీ చేతగాని మనిషి ఈ ప్రపంచంలో ఉండడు.
- సాగే ప్రవాహంలా వుండాలి. ఇతరుల మలినాలను తొలగించి తన ఒంటికి పూసుకు తిరిగే చీపురులా మారకూడదు.

శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి రచనల్లో విశిష్ట రచన

# వీరకాళికాంబా శతకము

భావచ్ఛందోఽనుసరణ: కీ.శే. డా॥ వి.వి.యల్.నరసింహారావు (కందిమల్లయ్యపల్లి) బ్రహ్మంగారి మఠం ఆస్థాన కవి

## విగ్రహపూజా

**శ్వేత శిలకు మ్రొక్క చెప్పెనా దైవంబు?**
**నీతిలేక జనులు నూతబడిరి**
**శిలకు మ్రొక్కినంత చిక్కునా దైవంబు?**
**కాళికాంబ! వీరకాళికాంబ! 385**

విగ్రహపూజా ప్రస్తావన చేసేటప్పుడు ఒకమాట చెప్పుకోవాలి. బ్రహ్మేంద్రుడు అచ్చమైన ఆస్తికుడు. నాస్తికుడు మాత్రము కాదు.

'అహం బ్రహ్మాऽస్మి' - 'నేనే బ్రహ్మమురా' అని అద్వైత తత్వాన్ని ఆచరణలో పెట్టి చూపిన బ్రహ్మేంద్ర స్వామి నాస్తికుడు కాడుగదా! కాకపోతే బ్రహ్మము నిర్గుణ బ్రహ్మమనీ, సగుణబ్రహ్మమని రెండు విధాలు. సగుణబ్రహ్మోపాసకులు విగ్రహారాధకులు. నిర్గుణ బ్రహ్మోపాసకులు ఉపాసనా రూపంగా ఆత్మయందే పరమాత్మను దర్శించే ప్రయత్నం చేస్తారు. బ్రహ్మేంద్రుడు స్వయంగా తాను వీరభద్రవిగ్రహం విగ్రహసృష్టికర్త అయినా నిర్గుణోపాసన పట్ల ఆయన అధికాసక్తి చూపారు. శిష్యులకూ అదే ప్రబోధించారు. ఈ దృష్టితోనే పై పద్యాన్ని అర్థం చేసుకోవాలి. తెల్లరాతితో భగవంతుని విగ్రహం చేసి, ఆ తెల్లచలువరాతికే భక్తులు పూజచేయాలని భగవంతుడు చెప్పలేదే? ఈ సంగతి నైతికదృష్టితో గ్రహించలేక ఎంతో ఖరీదైన శిలలతో దేవతా మూర్తుల్ని తయారు చేయిస్తుంటారు. ద్రవ్యం చాలక అప్పులపాలైన సందర్భాలూ ఉంటాయి. అంటే వారి స్థితి బావిలో పడినట్లే ఉంటుంది. ఇంతకూ ఱాతికి నమస్కారం చేసినంత మాత్రాన భగవంతుడు సాక్షాత్కరిస్తాడా? ఆత్మలోని నిర్గుణబ్రహ్మాన్ని సంస్మరిస్తే కరుణించడా? తప్పక కరుణిస్తాడు.

**హృదయ మందె యుండె హృత్కమలేశుండు**
**లింగసార మెఱుగు లింగవిభుడు**
**వంగి ఱాల మ్రొక్క వచ్చునా మోక్షంబు?**
**కాళికాంబ! వీరకాళికాంబ! 386**

హృదయాధిపతి అయిన భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. లింగస్వరూపుడై యున్న దేవుడు లింగము యొక్క ముఖ్యతత్వం తెలుసు కోకుండా ఉంటాడా? కనుక శిలారూపంలో ఉన్న దేవుడికి నమస్కరిస్తేనే మోక్షం వస్తుందనుకోవటం భ్రమ. కనుక వంగి వంగి శిలా విగ్రహాలకు మ్రొక్కటం కంటే ఆత్మలోని పరమాత్మను ధ్యానించటం ఎక్కువ ప్రయోజనకారి అని బ్రహ్మేంద్రుని భావన.

**దొంగఱాయి మెడకు లింగ మెట్లాయెరా?**
**పొంగలారగించి పోయె దొంగ**
**లింగమందె యున్న దొంగను పట్టుడీ**
**కాళికాంబ! వీరకాళికాంబ! 387**

భగవంతుడు కూడా భక్తుల నిజాయితీ పరీక్షిస్తుంటాడు. భక్తులు మెళ్లో చిన్ని ఱాతి లింగం కట్టుకొని "దేవుణ్ణి మేము కట్టిపడవేశాం; దేవుడింకెక్కడికి వెళ్లగలడులే'' అనుకుంటారట! కాని దేవుడు

దొంగభక్తుల కంటే ఇంకా పెద్దదొంగ. చూస్తుండగనే పొంగలి సాంతం ఆరగించి అయిపు లేకుండా వెళ్లాడట. అటువంటి టక్కరిదేవుడు లింగమెట్లా కాగలిగాడు? ఆ లింగాన్ని భక్తులు మెళ్లో ఎట్లా వేసుకొన్నారు? నిజమైన భక్తుడు లింగంలో నిక్షిప్తమైయున్న దైవాన్ని పట్టుకోవాలి. అంటే ధ్యాన, మననోపాసనల ద్వారానే అది సాధ్యం. కేవల బాహ్యపూజ వల్ల సాధ్యం కాదని భావం.

**వెలుగుచేసి దొంగ వెదకి పట్టుండయా**
**మలగుమేనివంటి మెలగుదొంగ**
**కొలన నుండెనేమొ వలవేసి పట్టుడీ**
**కాళికాంబ! వీరకాళికాంబ! 388**

బ్రహ్మేంద్రుని చమత్కార వాక్యధోరణి స్పష్టం. తప్పించుకు తిరిగే దొంగవంటి దేవుణ్ణి వెలుతురు వ్యాపింపజేసి పట్టుకోవాలి. మన దేహాన్నే అంటుకొని లింగరూపంలో ఉంటాడనుకోనక్కర్లేదు. మనదేహాన్ని విడిచి అంతటా సంచరిస్తుంటాడు. నేలమీద కనబడక పోతే నీళ్లలో వెదకాలి. జలజంతువుల దేహాల్లో చొరబడి ఉండవచ్చు. అందుకే తెలివిగల భక్తులు వలవేసి కొలనులో ఉండే జీవుల్ని పట్టుకొని దేవుణ్ణి వెదకాలి.

"సర్వాంతర్యామి దేవుడు" అనే భావాన్ని ప్రవచిస్తున్నారు బ్రహ్మేంద్రులు.

వలకోసం ఎక్కడికో పరుగెత్తవద్దంటున్నాడు.

**మనసు బంగరువల, మడుగున వేయుడీ**
**మడుగునందు మసలు మంచిచేప**
**చూచిపట్టవలయు సురిగిపోకుండను**
**కాళికాంబ! వీరకాళికాంబ! 389**

మన మనస్సే ఎంతో విలువైన బంగారపు వల. దాన్ని విప్పి విసిరి కొలనులో వేయండి. కొలనులో మంచి మంచి చేపలు మసలుతున్నాయి. చేపలు కూడా తెలివైనవి. వలలోపడకుండా తప్పించుకొని పోవాలని ప్రయత్నిస్తాయి. పోకుండా జాగ్రత్తగా వల విసిరి చేపను పట్టుకోవాలి. చేప ఆత్మలో కూడా భగవంతుడుంటాడు. ఆయన్ను పట్టుకోవటం కోసమే చేపను పట్టుకోవాలి. ఇదీ భగవంతుడి కోసం చేసే ఒక అన్వేషణే.

**వలను పెనచివైచి, వడిమీఱవైచుడీ**
**తొలగిపోకయుండ తొంగిచూచి**
**మలగు మీనుసుమ్ము మడుగులో నున్నది**
**కాళికాంబ! వీరకాళికాంబ! 390**

వలవేసే ఒడుపు వివరిస్తున్నాడీపద్యంలో. వేగంగా కొలను మీద వ్యాపించి పడేట్లు వలను విసరివేయాలంటున్నాడు. మనమెట్లా బంధంలో చిక్కుకోకుండా తప్పించుకుపోయే ప్రయత్నం చేస్తామో చేపకూడా అటువంటి ప్రయత్నమే చేస్తుంది. కనుక తెలివితో పట్టాలి చేపను.

**సత్తనేటి మడుగు సాధించి శోధించి**
**గుట్టుతెలసి గట్టి పట్టుపట్టి**
**మీనుపట్టు డద్ది మింటికెగురునేమొ**
**కాళికాంబ! వీరకాళికాంబ! 391**

మడుగంటే వట్టి కొలను అని మాత్రమే భావించరాదు. అది సత్యానికి సాత్వికత్వానికి ప్రతీక. సత్య నిరూపణకు జీవుడు సాధకుడు కావాలి. శోధకుడు కావాలి. తత్వరహస్యం తెలుసుకోవాలి. గుట్టు తెలుసుకోవడమంటే మర్మం భేదించటమనే అర్థం. దానికి పట్టుదల కావాలి. సంకల్పశుద్ధి కావాలి. ఇన్ని ఉంటేకాని పరమాత్మను నిక్షేపించుకొని వున్న మత్స్యం అన్వేషకులకు లభించదు. మత్స్యం చిక్కకుండా

పైకెగరి పోవచ్చు. పోనీకుండా సాధకుడు జాగ్రత్త వహించాలి.

పరమాత్మను శోధించి, సాధించే సాధకుడు ఇంత శ్రమపడవలసి ఉంటుందని బ్రహ్మేంద్రుని అభిప్రాయం.

**చుట్టమైన దేహి శోధన మేమాయె?**
**సారమింతలేక సాగె చర్చ**
**స్వస్తియన్న నెట్లొ సాధించి కనవచ్చు**
**కాళికాంబ! వీరకాళికాంబ! 392**

శరీరధారియైన సాధకుడు బంధుప్రేమతో భగవంతుని శోధించి సాధించాలనుకొంటాడు. "అట్లాకాదు, ఇట్లా అని ఎవరైనా చెప్పవస్తే వారితో సుదీర్ఘ చర్చకు దిగి తన మార్గమే మంచిదని వాదిస్తాడు. చర్చ నిస్సారంగా ఉండవచ్చుగాక! స్వస్తి = సు + అస్తి 'శుభమున్నది' అని అనుకొని వాదం ముగించవచ్చు. స్వస్తి అనే మాటలో 'ముగింపు' అనే ధ్వని కూడా ఉంది కదా! స్వస్తివాచనం ముగింపులోనే పలుకుతుంటాం. వాదం శుభాంతంగా ముగిస్తే ఫలం శుభాంతమౌతుంది మాటల కంటే ఆచరణపై సాధకుడు దృష్టి కేంద్రీక రించాలని భావం.

**సోऽహ మనెడు తెరువు శోధించి చూచుట**
**సాహసం బెటౌను సరసులకును?**
**అనిమిషులగువారి కర్ధమౌ సర్వంబు**
**కాళికాంబ! వీరకాళికాంబ! 393**

"సః + అహమ్" అతడే నేను 'ఆ పరమాత్మయే నేను' అనే అద్వైత మంత్రాన్ని మార్గదర్శకంగా గ్రహించి సాధకుడు శోధన సాగించాలి. ఈ ప్రయత్నం రసజ్ఞులు దృష్టిలో సహజప్రయత్నమే కాని సాహసకార్యం కాదు. విషయాన్ని జాగరూకంగా - రెప్పవేయకుండా చూడ గలిగితే 'సోऽహ' మనే అద్వైతమంత్రం అవశ్యం ఆచరణీయమనిపిస్తుంది. రెప్పవేసే అలవాటులేని అనిమిషులు దేవతలు. అటువంటి దివ్యలక్షణంతో విషయాన్ని చూడగలిగితే పరమాత్మ తత్వం సుగమ మౌతుంది.

విగ్రహపూజ సగుణబ్రహ్మోపాసన ఆత్మధ్యానం నిర్గుణోపాసన. కష్టమైన ఈ రెండవ మార్గమే జీవుణ్ణి దివ్యుణ్ణి చేస్తుంది. అనిమిషదృష్టిగల దివ్యులకు సర్వమూ అర్థమౌతుంది. దీనికి కరుణ తత్వాన్ని, మతతత్వాన్ని అవగతం చేసుకోవాలి. దాన్ని గూర్చే చెప్పబోతున్నాడుస్వామి.

- మనం చేసే ప్రతిపనీ ధర్మం కనిపెడుతూనే ఉంటుంది. పంచభూతాలు చూస్తూనే ఉంటాయి. అంతరాత్మ పరిశీలిస్తూనే ఉంటుంది. ఇక ఉదయం, సాయంత్రం, పగలు, రాత్రి, సూర్యుడు, చంద్రుడు ఇవన్నీ ఉండనే ఉన్నాయి. ఇన్నిటి ఎదుటా చేసేపని కప్పిపుచ్చుకోవటమంటే ఆత్మవంచనే.
- కళ్లకు కనురెప్పలు ఎంత దగ్గరగా ఉన్నాయో దైవం మనకంత దగ్గరగా ఉన్నాడు. కళ్లు కనురెప్పలను చూడలేనట్లే మనం సన్నిహితంగా వున్న దైవాన్ని చూడలేకపోతున్నాం. అయినా నిరంతరం రెప్పలు కళ్లను కాపాడినట్లే దైవం మనల్ని కాపాడుతుంటాడు.
- సత్యం, ఆత్మనిగ్రహం, వైరాగ్యం, ఔదార్యం, అహింస, సజ్జనత్వం ఇవన్నీ విజయానికి సోపానాలు

# నైతిక విలువలు

.....ఆంధ్రరత్న జివి శేషారెడ్డి

నీతి, నిజాయితి ధర్మం, సత్యం, న్యాయం అనేవి ప్రతి మనిషి జీవితంలో ప్రామాణకాలు కావాలి. యుగాలు మారవచ్చు. నీతి, సత్యం, ధర్మం మారవు. పరిస్థితులకు అనుగుణంగా మార్పు చోటు చేసుకోవచ్చు. "కలికాలంలో ధర్మం నాలుగు పాదాల నడవదు' అన్న అపవాదు ఉన్నది కదా! మానవ జీవితం రథం అయితే నీతి నిజాయితి ధర్మం, సత్యం అనేవి రథం నాలుగు చక్రాలుగా మారితే జీవిత రథ ప్రస్తానం ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా న్యాయబద్దంగా ముందుకు సాగిపోతుంది. మనిషి మానవత్వాన్ని మరవకపోతే నైతిక విలువలు మనిషిని ఎప్పుడు కూడా అంటి పెట్టుకుని ఉంటాయి. పండిన మానవత్వమే దైవత్వం కదా! మానవ విలువలు నైతిక విలువలు. ఎందుకంటే మనిషి జన్మను సార్థకం చేసుకోవడానికి తాపత్రయ పడడంలో మానవ విలువలకు ప్రాధాన్యత ఇస్తాడన్నది నిజం. "నీతేవ జయతే", "సత్యం వ జయతే" "ధర్మం వ జయతే".

నీతిని విడనాడక పోతే నీతే రక్షిస్తుంది. సత్యం పలికితే సత్యమే రక్షిస్తుంది. ధర్మాన్ని పలికితే ధర్మమే రక్షిస్తుంది. నీతి నియమాలు కలిగిన వాడు సత్యమునే వలుకుతాడు. సత్యాన్ని విడనాడని వాడు ధర్మయుక్తంగా ప్రవర్తిస్తాడు ఇతరులకు ఆదర్శం అవుతాడు. సమాజంలో మానవుడు ఉత్తమంగా రాణించి తన దేశానికి పేరు తెచ్చే సమయం మనిషి నైతిక విలువలతో ఉత్తమ పౌరుడుగా ఉన్నపుడు కదా! మానవుడు నీతిని ఊపిరిగా భావించినపుడు సత్యాన్ని ధర్మాన్ని విడనాడడు. వేద సంస్కృతిలో వర్ణవ్యవస్థ ఉన్నట్లు నేడు కూడా సమాజంలో వర్ణవ్యవస్థ ఉంది. ధర్మం నాలుగు పాదాల నడవాలంటే నైతిక విలువలతో కూడిన వర్ణవ్యవస్థ సమాజానికి అత్యంత ఆవశ్యకము. వర్ణవ్యవస్థ ఆదిమకాలము నుంచి ఆధునిక కాలము వరకు బాధ్యతాయుతంగా నీతిని మరవకుండా తమకున్న బాద్యతలను నిర్వర్తిస్తూ ఉండడం వల్లే ధర్మాన్ని రక్షించగలము. సమాజ శ్రేయస్సుగాని కుటుంబ సంక్షేమం గాని సమాజానికి, కుటుంబానికి ఆయువు పట్టు అయిన మనిషి నైతిక విలువలు కలిగి ఉన్నపుడు మాత్రమే చూడగలం. బాధ్యతే దైవం కదా! అందుకే విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ విరచితమైన గీతాంజలిలో దేవుడు నాలుగు గోడల మధ్యలో లేడు. ఎక్కడైతే రైతు పొలం దున్నుతున్నాడో ఆ రైతు శ్రమలోను, ఒండరాయిని ముక్కలు చేస్తున్న శ్రామికుని స్వేదంలోను, దేవుడున్నాడని తెలపడంలో స్వేదమే వేదమని బాధ్యతను మించిన దైవం లేనట్టే కదా! నీతి నిజాయితిలు మనిషికి బాధ్యతలు గుర్తు చేస్తూనే ఉంటాయి. మానవుని జీవితం నైతిక విలువలతో కూడి ఉన్నపుడు తను అమరజీవి. మనిషి జీవితం యోగి వేమన చెప్పినట్లు "పుట్టలోన చెదలు పుట్టదా" ? అన్న చందాన ఉండకూడదు. మనిషి వెంట వచ్చేది మంచితనం, ధర్మం, సత్యం, నీతి నిజాయితి.

నాగరికత పెరగడం అంటే స్వార్థం ఎక్కువ కావడమా ? స్వార్థం ఎక్కువ అయితే మానవుడు నీతిని మరుస్తాడు. నిజాయితిని తుంగలో తొక్కుతాడు.

సభ్య సమాజంలో నైతిక విలువలు లేని జీవితం జీవశ్చవం లాంటిది. భారతదేశం వేదభూమి. పుణ్యభూమి. భారతదేశం అంటేనే నీతి, నిజాయితి, ధర్మం, సత్యం అనే నానార్థం కలిగిన పవిత్రభూమి. భారతీయులమని గర్వంగా చెప్పుకునే మనము మనదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలంటే ప్రతి భారతీయుడు నీతి, నిజాయితిలతో ఔన్నత్యాన్ని పెంచుకోవాలి. స్వామి వివేకానందుడు ధర్మ నిరతుడు సత్యవ్రతుడు. నేటి యువతకు ఆదర్శపురుషుడు. నాడు చికాగోలో ప్రపంచ మత సమ్మేళనంలో తాను ప్రసంగించిన ప్రసంగం నీతి నిజాయితిలకు నిలువెత్తు నిదర్శనం కదా! గాంధి మహాత్ముల వారు తన అహింసా సిద్ధాంతం నీతి నిజాయితిలకు ఆలవాలమై 350 సం॥ పాలించిన బ్రిటిష్ వారిని "క్విట్ ఇండియా" "డు ఆర్‌డై" అన్న నినాదాలతో భారతదేశానికి స్వతంత్ర్యం ఇవ్వలేదా!"సత్యమేవ జయతే" "ధర్మో రక్షతి రక్షితః" అని భావిస్తే తన జీవితాలకు అలంకారంగా నీతి నిజాయితిలను అలవరుచుకుంటారు.

నైతిక విలువలు పెంచడానికి విద్యావిధానంలో సమూలంగా మార్పులు చేయాలి. ఎందుకంటే "మొక్కై వంగనిదే మానై వంగునా" అందుకే ప్రాథమిక విద్యా స్థాయి నుంచి పిల్లలకు నీతి నిజాయితిల విలువలు తెలిపే పాఠ్యాంశాలను చేర్చి బోధించాలి. పాఠ్యాంశాలను బోధించే బోధకులు అంటే ఉపాధ్యాయులు ఆదర్శవంతులై ఉండాలి. కార్పోరేట్ విద్యలో నీతి పాఠాలు అసలు లేవు. మార్కుల కోసం విద్య ఉందేకాని మానవ విలువల కోసం కాదు. కార్పోరేట్ విద్యా సంస్థలన్నిటిలో నైతిక విలువలను పెంచే చదువు మృగ్యమైనది. గతంలో పాఠాలలో నీతి కథలుండేవి. మోరల్ పీరియడ్ ఉండేది. వీటి ద్వారా విద్యార్థులకు నీతి నియమాలు, నైతిక విలువల ప్రాధాన్యత తెలిసేది. నేటి పోటి ప్రపంచంలో ప్రాధాన్యత అంతా ప్రాపంచికానికీ నైతిక విలువలు లేని విద్య నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో ఆ విధంగా నేటి చదువులు ఉంటూ నిస్సారంగా, నిత్తేజంగా ఉన్నాయంటే అతిశయోక్తి లేదు.

నీతి వాక్యాలెన్నో, నీతి కథలెన్నో వాటి సారాంశాన్ని అవపాసన చేస్తే చాలు ప్రతి మనిషి జీవితం ఆదర్శమే కదా! తల్లి, తండ్రి గురువు, దైవం అన్న ప్రాథమిక వాక్యంలో ఎంత గొప్ప అర్థం ఉందో! ఇటువంటి సూక్తులలోని అర్థాన్ని పిల్లలకు విశ్లేషిస్తే చిరస్థాయి మనస్సులో ఉంచుకుంటారు కదా! తల్లిదండ్రులు మొదటి గురువులు. ఛత్రపతి శివాజికి, శ్రీరామచంద్రునికి, మహాత్మగాంధీ గారికి వారి తల్లిదండ్రులు బోధించిన నీతి కథల వల్ల వారి జీవితాలను వారు సత్యాన్ని, ధర్మాన్ని, అహింసను, కాపాడటానికి కొవ్వత్తుల్లాగా కరిగిపోయారు. ఆలోచనలు ధర్మబద్ధంగా ఉన్నపుడు నీతిని ఊపిరిగా మలచుకుంటాం. మానవ జన్మ మహోన్నతమైనది. మానవుడిగా పుట్టడం గత జన్మపుణ్య ఫలం. మానవజన్మకు సార్థకత ఈ భూలోకంలో మనం నిర్వర్తించవలసిన బాధ్యతలను సక్రమంగా నీతితో నిజాయతిగా ధర్మబద్ధంగా సత్యాన్ని గౌరవిస్తూ చేయగలిగినపుడు మానవ జన్మకు సార్థకత ఏర్పడుతుంది. నీతి నియమాలను ఉల్లంఘించినపుడు తను ఆదర్శంగా ఉండడమే కాకుండా ఇంకొక జన్మ లేకుండా చూసుకోగలడు. మానవుడు ఏ రంగం అయినా కావచ్చు తను చేసే ప్రతి పనిని సేవగా భావిస్తే నీతి నియమాలను మరువడు. తను చేసే ప్రతి పని నైతిక విలువలతో కూడుకున్నదై ఆదర్శంగా నిలువగలదు. అశోక చక్రవర్తి

ధర్మ అశోకుడుగా మారడానికి, సిద్ధార్థుడు బుద్ధుడుగా మారడానికి రాముడి పాలనను ఆదర్శంగా తీసుకుని రామరాజ్యం నేటి పాలకులకు ఆదర్శంగా ఉండడానికి గుప్తుల కాలాన్ని స్వర్ణయుగం అనడానికి వారు అనుసరించిన నైతిక విలువలు ఎంత గొప్పవో తెలుసుకోవచ్చుకదా!

గ్రీకు తత్వవేత్త ప్లాటో ప్రతిపాదించిన విద్య - రాజ్యాధికారం నైతిక విలువలతో నిండి ఉంటే రాజ్యాధికారాన్ని ''వేదాంతపు రాజులు'' దక్కించుకుంటారు అరిస్టాటిల్ ప్లాటో ప్రతిపాదించిన విద్యలో నైతిక విలువలు కూడుకుని విద్యార్థి ఒక ఆదర్శ విద్యార్థిగా ఆదర్శపౌరుడిగా ధర్మాన్ని సత్యాన్ని అహింసలను ఆయుధంగా చేసుకుని మానవజన్మను సార్ధకం చేసుకుంటాడు కదా! శ్రీ సత్యసాయి దేవుడు, జిడ్డు క్రిష్ణమూర్తి, స్వామి వివేకానందుడు, డా॥ రాధాక్రిష్ణన్ చదువు గురించి రాస్తూ నైతిక విలువలు లేని విద్య జీవశ్చవం లాంటిదని అభివర్ణించారు.

ప్రాధమిక దశలోనే నైతిక విలువలనే విత్తులను విద్యార్థులలో నాటితే ఆ మొక్క పెద్దదై సత్యం అనే వట వృక్షంగా మారితే ధర్మం అనే ఊడలు ఏర్పడతాయి. నేటి ప్రాపంచీకరణ అనే ఆర్థిక స్వేచ్ఛతో ఎటువంటి నిర్భంధాలు లేకుండా వ్యాపారాన్ని సాగిస్తున్నా ఈ తరుణంలో కార్పొరేట్ వ్యవస్థలో నేడు చిన్న పిల్లల మనస్థత్వాలు సంకుచితంగా ఉండడం శోచనీయం. దీనికి కారణం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే అని ఒప్పుకోవడం సమంజసమే.

"యద్భావం తద్భవతే" అన్నారు. అంటే భావనను తలంపులను బట్టీ చేపట్టే ప్రక్రియ ఉంటుంది. అందుకే నీతి నియమాలు సంస్కృతి సాంప్రదాయాలు సత్యధర్మ నిరతులను విడనాడకుండా సమాజంలో ప్రతి ఒక్కరు తమను తాము సంస్కరించుకుంటే నైతిక విలువలతో కూడిన స్వచ్ఛభారత్, స్వర్ణభారత్‌ను తయారు చేయవచ్చుకదా! అందుకే తలంపులు తలవంపులు కాకూడదు. పరిశోధిస్తే పరిణామము ఎప్పుడూ పవిత్రమే. ఆలోచన విశ్లేషిస్తే గమ్యం ఎపుడూ సత్యం వైపే, నీతి ధర్మాల వైపే.

- సత్యమనేది వెయ్యి (బహు) కోణాలు కలిగిన ఉమ్మెత్తకాయ లాంటిది. దానిని ఎటుత్రిప్పినా ముల్లు కనిపించినట్లే సత్యం అనేది చూచేవాడి దృష్టిని బట్టి మారుతూ ఉంటుంది. నిజానికి అది ఏ మార్పూ చెందనిది. ఇది తెలిసేటప్పటికి లోకమంతా (అతనికి) మాయమవుతుంది.
- అప్పుడే పిండిన పాలు వెంటనే పెరుగుకానట్లు నేడు చేసిన పాపపు ఫలం వెంటనే అనుభవంలోనికి రాదు. అది నివురు గప్పిన నిప్పవలె అదను చూచి దహించి వేస్తుంది.
- కత్తిపీటతో రకరకాల వస్తువులను కోస్తాము. అయితే దానికి వాటిలోని దేని రుచైనా తెలుస్తుందా ? తెలియదు. అలాగే మనసు పెట్టకుండా చేసే ఏ పనిలోనూ మాధుర్యాన్ని మనం గుర్తించలేము.

# శ్రీ గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి వారి కళ్యాణం



శివకోటయ్య, పెదకొమెర్ల గ్రామపెద్దలతో కలిసి స్వామిని వివాహానికి ముహూర్తం నిశ్చయించమని అడిగాడు. స్వామి మహాశివరాత్రి రోజు వివాహ ముహూర్తాన్ని నిశ్చయించాడు. వివాహం అల్లాడుపల్లెలో జరగాలని అందుకు వలసిన ఏర్పాటు చూడమని చెప్పాడు. శివకోటయ్య పెళ్లిపనులలో నిమగ్న మయ్యాడు. పెండ్లి పత్రికలను వ్రాయించి గ్రామగ్రామాలకు పంపించాడు. పెండ్లికి అంతమంది వస్తారు -ఇంతమంది వస్తారు అని లెక్కలు కడుతున్నాడు. మళ్లీ ఈ లెక్కలన్నీ మనకందవులే మన ప్రయత్నం మనం చేద్దామనుకున్నాడు. ఇలా సతమతమవుతూ "అమ్మా! గోవిందమాంబా నీ కల్యాణానికి ప్రజలెంత మంది వస్తారంటావు" అని అడిగాడు.

"లెక్క కందనంత మంది" అంటూ నవ్వుతూ సమాధానం చెప్పింది.

"ఆ..."

"అవును మరి! దేవతలు కూడా వస్తారు. చూస్తారా మరి" అని చమత్కారం గా చెప్పింది.

ఆయనకది అర్థమయ్యీ అర్థం కానట్లు నవ్వుకున్నాడు.

పెదకొమెర్ల గ్రామస్థులంతా తమ యింటిలో పెళ్లి లాగానే ఎవరికి వారే హడావిడిగా వున్నారు. "ముహూర్తం అప్పుడే దగ్గర పడుతోందే!" అనుకుంటూ తలో పని చేస్తున్నారు.

## అల్లాడుపల్లెకు పయనం

సుముహూర్తం సమీపించింది. అల్లాడుపల్లె వెళ్లడానికి ఏర్పాట్లు చేశారు.

ఆకాశవాణి "దేవఋషి భక్తగణంబులారా! ప్రజలారా! అల్లాడుపల్లెలో జగత్కర్త శ్రీవీరబ్రహ్మేంద్రస్వామికి, జగజ్జనని శ్రీగోవిందమాంబకు కనుల విందుగా కల్యాణం జరగబోతోంది. అందరూ వచ్చి ఆ జగత్కల్యాణాన్ని తిలకించి వారి ఆశీర్వాదాన్ని పొంది తరించండి" అని నినదించింది. ఆ నినాదం ఏడేడు లోకాలన్నింటికీ వ్యాపించింది.

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథాలలో వీరబ్రహ్మేంద్రస్వామి గోవింద మాంబ విడివిడిగా బయలుదేరారు. గ్రామస్థులంతా సుందరంగా అలంక రించిన ఎడ్లబండ్లలో బయలుదేరారు. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు కూడా అలాగే ఎడ్లబండ్లలో అల్లాడుపల్లె వైపు సాగారు. ఎటుచూచినా, ఏ డొంకల దారులు చూచినా ఎడ్లబండ్లు చెంగుచెంగున పరుగులతో సాగిపోతున్నాయి.

## పెళ్లిపందిళ్లు

అల్లాడుపల్లె గ్రామస్థులు, పెదకొమెర్ల నుండి ముందుగా వచ్చిన వారు, కందిమల్లయపల్లె నుండి వచ్చిన ప్రజలు, మరియు పలుప్రాంతాల నుండి వచ్చిన ప్రజలంతా కలిసి, స్వామి కల్యాణానికి వచ్చే ప్రజల కొరకు పందిళ్లు వేస్తున్నారు. ఎవరికి వారే ఆనందంగా ఆకాశాన్నంటే పందిళ్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అల్లాడుపల్లెకు దూరతీరాల నుండి అనేక గ్రామాల నుండి ప్రజలు ఎడ్లబండ్లపై, కాలినడకన, విరివిగా వచ్చి చేరుతున్నారు. వృద్ధులు

డోలీలు కట్టించుకొని పెండ్లికి వస్తున్నారు. కనుచూపుమేర ఎటుచూచినా జనసందోహమే! ప్రజలు సముద్రంగా కనిపిస్తున్నారు. అంతా కోలాహలంగా వుంది.

బనగానపల్లె నుండి అన్నాజయ్య, వెంకటరెడ్డి, అచ్చమ్మ, బ్రహ్మానంద రెడ్డి, తదితరులు వచ్చారు. ముత్యాల తలంబ్రాలతో బనగానపల్లె నవాబు వచ్చాడు.

## దేవతల పయనం

దేవతలంతా స్వామి కల్యాణానికై భూలోకం పయనమయ్యారు. ఆకాశ మార్గాన ఆదిశేషుడు, మేఘవాహనంపై విశ్వకర్మ, కమలవాహనంపై గాయత్రీదేవి, ఆత్మసింహాసనంపై ముక్తికాంత, నందీశ్వరునిపై పార్వతీ పరమేశ్వరులు, గరుత్మంతునిపై లక్ష్మీనారాయణులు, హంసవాహనంపై సరస్వతీ బ్రహ్మలు ఐరావతంపై శచీఇంద్రులు సప్తాశ్వరథంపై సంజ్ఞాభాస్కరులు, ఎలుకవాహనంపై విఘ్నేశ్వరుడు, నెమలివాహనంపై సుబ్రహ్మణ్యస్వామి, వాయువేగంతో ఆంజనేయుడు ఇలా యక్షకిన్నరకింపురుష సిద్ధవిద్యాధరాది ముప్పది మూడుకోట్ల దేవతలు భూలోకం బయలుదేరారు. దేవతలంతా అల్లాడుపల్లె సమీపించారు. అంతర్యాములై కొందరు, మారువేషాలలో కాంతివంతమైన విలక్షణ రూపాలతో కొందరు, వచ్చి చేరారు.

వస్తారుమరి! ఆ అనాది దంపతుల పెళ్లి ఇంతకుముందు వీరు చూచి యుండ లేదు కదా! పిల్లల కోసం పెద్దలు షష్టిపూర్తి చేసుకుంటున్నట్లు ఈ దేవతలకోసం అనాది దంపతులు ఈనాడు వధూవరులైనారు. ఆహా ఏమా కమనీయదృశ్యం. చూచిన వారిదేకదా భాగ్యం!

వీరభద్రస్వామి సకల దేవతలకు ప్రణామములు సమర్పించి సాదరంగా ఆహ్వానించాడు. దేవతలు వారికై ప్రత్యేకంగా అలంకరించిన ఆసనాలపై కొలువుతీరారు.

ఆంజనేయుడు సుబ్రహ్మణ్యస్వామి చలువ పందిళ్లు అలంకరిస్తున్నారు. వరుణదేవుడు వచ్చిన వారికి మంచితీర్థాన్ని అన్ని దిక్కులందు అందుబాటులో అమర్చాడు. వాయుదేవుడు చల్లని పిల్లగాలులతో అందరినీ అలరిస్తున్నాడు. విఘ్నేశ్వరుడు వచ్చిన వారిని ఆహ్వానిస్తున్నాడు. అశ్వనీదేవతలు ప్రజలందరినీ పరామర్శించి పలుకరిస్తున్నారు.

## స్వామివారి ఆగమనం

వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబామహాదేవి అల్లాడుపల్లె సమీపించారు. వీరభద్రస్వామి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబలను భక్తిప్రపత్తులతో స్వాగతించాడు. దేవతలందరూ కాబోయే కల్యాణదంపతులకు అంజలి ఘటించి ఆహ్వానం పలికారు. వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ దేవతలందరినీ ఆశీర్వదించారు. స్వామి రాకకై నిరీక్షిస్తున్న భక్తులంతా వారిని దర్శించి ఆనంద పారవశ్యంతో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామికి జై గోవిందమాంబకు జై అంటూ జేజేలు పలికారు. అందరిలో భక్తిభావం పెల్లుబుకగా ఆ స్వామిని తనివి తీరా దర్శిస్తున్నారు.

సప్తఋషులు, సకల మునిజనాలు, స్వామి సన్నిధికి చేరారు. అత్రి స్వామికి పాదాభివందనం చేసి''దేవాధిదేవా! వీరబ్రహ్మేంద్ర సార్వభౌమా! బ్రహ్మ ఋషులంతా ఎవరి కోసం తపస్సులను కొనసాగిస్తున్నారో! మహా భక్తులంతా నిరంతరం ఎవరిని కీర్తిస్తున్నారో! సకలజీవుల చరమయానం (ముక్తి

యాత్ర) ఎవరి వైపు సాగిపోతున్నదో! ఈ చరాచర సృష్టి ఎవరినుండి ఆవిర్భవించిందో! ఇదంతా మళ్ళీ ఎవరిలో లయమవుతుందో! సమస్త దేవబృందం నిరంతరం ఎవరిని స్మరిస్తుందో! అట్టిచాతుర్యోగాతీతులైన మీరు నేడు దివ్యమంగళ రూపులై యిట నిలిచి మమ్మనుగ్రహించుచుంటిరా స్వామీ!" అని స్తోత్రం చేశాడు. భక్తి పారవశ్యంతో నున్న అత్రిని స్వామి ఆలింగనం చేసుకొని మందహాసంతో ఆశీర్వదించాడు.

బాల్యంలో ఆయన వద్ద నున్నందుకు గాను అత్రికి ఈ ప్రత్యేక సత్కారం లభించింది. మిగిలిన ఋషులందరినీ స్వామి చిరునవ్వుతో అనుగ్రహించి ఆశీర్వదించాడు. బనగానపల్లె నుండి వచ్చిన నవాబు, అన్నాజయ్య, వెంకట రెడ్డి, అచ్చమ్మ, తదితరులు స్వామివారిని దర్శించి వారి ఆశీర్వచనాన్ని పొందారు. గోవిందమాంబా వీరబ్రహ్మేంద్రులు ప్రత్యేకంగా అలంకరించబడిన ఆసనాల పై ఆసీనులైనారు. దేవతలంతా వారివారి ఆసనాల నలంకరించారు. వీరభద్ర స్వామి, అత్రి మహాముని ఆ ప్రక్కనే ప్రత్యేకంగా ఆసీనులయ్యారు.

కల్యాణఘడియలు సమీపిస్తున్నాయి. గాయత్రీదేవి దివ్యమైన కల్యాణ వేదికను సృజించింది. ముక్తికాంతా మహాదేవి మంగళకరమైన మాంగల్యాన్ని, ముత్యాల తలంబ్రాలను, బంగారు పళ్లెరములందుంచి, వాటిని వేదికపై నుంచింది. ఆంజనేయుడు, నారదుడు, తుంబురుడు దివ్యగానం చేస్తుండగా, గంధర్వకాంతలు నాట్యం చేస్తుండగా, అత్రి తదితర ముని సత్తములు నామ సంకీర్తన చేస్తుండగా, ఆ అద్భుత రమ్యరమణీయ గానాలాపం సకల భక్తముని జనాలను తన్మయులను చేస్తుంది. [1]పంచశక్తులు గోవిందమాంబను ప్రత్యేకంగా అలంకరించారు.

[2] పంచబ్రహ్మలు వీరబ్రహ్మేంద్రుని తమదైన శైలిలో అలంకరించారు.

ఇద్దరినీ కల్యాణవేదికకు తీసుకొని వచ్చి కుర్చుండబెట్టారు. పంచశక్తులు అమ్మవారి ప్రక్కన ఆసీనులయ్యారు, త్వష్ట ప్రజాపతియైన బ్రహ్మ పౌరోహిత్యం చేస్తున్నాడు. అశేషజనవాహిని స్వామివారి కల్యాణాన్ని చూడడానికై ఆత్రుతపడు తుండగా, కల్యాణవేదికకు దూరంగా వున్నవారికి స్వామివారు కనిపించ నందున భక్తులు స్వామిని అయ్యా! దేవదేవా! వీరబ్రహ్మేంద్రదేవా! దివ్యమూ, భవ్యమూ, మహిమాన్వితమూ అయిన మీ జగత్కల్యాణాన్ని చూచే భాగ్యాన్ని మాకున్నూ ప్రసాదించండి స్వామీ! అని వేడుకుంటున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి భక్తుల విన్నపాన్ని ఆలకించాడు కాబోలు అలా గోవిందమాంబ వైపు చూచాడు. ఆ చూపులోని ఆంతర్యం ఆ జగత్కర్త్రిణికి అర్థమైంది. ఆమె ఒక్కసారి తన అభయహస్తంతో వేదిక నలువైపు చూచి ఆశీర్వదించింది. కనీ వినీ ఎరుగని అశేషభక్తవాహినికి ఎక్కడి వారికి అక్కడే కల్యాణవేదిక దివ్యంగా కనిపిస్తోంది. అడిగిందే తడవుగా కోర్కెలు తీర్చే కల్పతరువులైన గోవిందమాంబా వీరబ్రహ్మేంద్రులను మదిలో స్మరించు కుంటూ ఆ మహనీయ దృశ్యాన్ని ఆనందంగా తిలకిస్తున్నారు సర్వభక్తావళి.

ఆకాశం నుండి వివిధ రకాలైన పుష్పాలు ఆ కల్యాణ దంపతులపై జాలువారుతున్నాయి. అందరి దృష్టీ ఆ యిద్దరిపైనే సారించారు. దేవతలు ఆ అనాది దంపతుల లీలా వినోదాన్ని స్మరిస్తుండగా, ఋషిపుంగవు లంతా ఆహా! ఏమి మన భాగ్యం. ఎక్కడో దేవలోకాలలో జరుగవలసిన ఈ మహత్క

ల్యాణం మనకొరకే కాబోలు ఇక్కడ జరుగుతున్నది. ఏమి ఆ కరుణామూర్తి అనుగ్రహం. ఆ యమ్మ గోవిందమాంబ కరుణాదృష్టితో ఈ లోకాలన్నీ చల్లగా సాగి పోతున్నాయి. నేడు ఆమె యిందరిని ఈ విధంగా అనుగ్రహిస్తోంది. వారి భక్తపాలనకు ఇంత కంటే ఏం నిదర్శనం కావాలి అని స్మరించుకుంటూ దివ్యానందమయులై యున్నారు.

అందరినీ అనుగ్రహించే ఆ గోవిందమాంబా వీరబ్రహ్మేంద్రులను కొనియాడుకుంటూ అలాగే ఆనందమయులై దర్శిస్తున్నారు భక్తజనులు. అశేష జనవాహిని యున్న ఆ ప్రదేశం వాయుదేవుని మెల్లమెల్లని సవ్వడులను సైతం వెలికితీస్తున్నాయా అన్నంతటి (నిశ్శబ్దం) ప్రశాంతత చోటుచేసుకున్నది.

ఇంతలో సరస్వతీపతి వేదమంత్రాలు చదువుతున్నాడు. ఆ మంత్రాలు అటు దేవతలకు, యిటు ఋషులకు, ఆ వైపు భక్తులకు చెవులలో సన్నగా జొరబడగా అందరూ మెల్లగా ఆ తన్మయావస్థనుండి లేచారు. స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్నారు. ప్రజాపతి ''మాంగల్యం తంతునానేన....'' అంటూ వేద మంత్రోచ్చారణతో మంగళసూత్రాన్ని అందరికీ చూపించాడు. అందరూ ఆ పవిత్ర లోక సంరక్షణా మాంగల్యాన్ని మనసారా కనులకద్దుకొని నమస్క రించారు. ఆ మాంగల్యాన్ని వీరబ్రహ్మేంద్రుని కందించాడు విధాత. దానిని అందుకున్న స్వామి దేవభక్తఋషి గణములవైపు వారి అనుమతికై అన్నట్లుగా చూచి జగజ్జనని యైన గోవిందమాంబా మహాదేవికంఠాన్ని అలంకరింపచేశాడు. దేవతలు **జై వీరబ్రహ్మజై! గోవిందమాంబజై!** అంటూ నినదించారు. ఋషి, భక్తజనులు ఆ దివ్యనామాన్ని ముక్తకంఠంతో పలికారు. అలా కొంతతడవు ఆనామాన్ని స్మరించి ఆనందించారందరూ. గోవిందమాంబా వీరబ్రహ్మేంద్రుల జగత్కల్యాణం జగజ్జేగీయమానంగా జరిగింది. దేవతలు ఆ అనాది దంపతులపై పుష్పవర్షం కురిపించారు. ఋషిబృందాలు శాంతి మంత్రాలు చదివారు. భక్తజనులు దివ్యనామస్మరణతో తమ కృతజ్ఞత తెలుపుకున్నారు. అలా స్వామి వారి కల్యాణం కనులవిందుగా జరిగింది.

జై వీరబ్రహ్మ జై! గోవిందమాంబ జై! అనే ద్వాదశాక్షరి మంత్రాన్ని ముమ్మోదట దేవతలు స్మరించి, సర్వకర్మలూ, మహాప్రళయాలు, అనేక సంక్లిష్ట సమస్యల నుండి విముక్తి పొంది ఆయురారోగ్య ఐశ్వర్య సుఖసంతోషా లతో వర్ధిల్లుటకై భూలోకానికి కానుకగా ఇచ్చారు. ఋషిభక్తగణా లందరూ కూడా 'జై వీరబ్రహ్మ జై! గోవిందమాంబజై!' అంటూ కీర్తించారు. అలా ఆవిర్భవించిందీ ద్వాదశాక్షరీ మహామంత్రము.

దేవతలు గోవిందమాంబా వీరబ్రహ్మేంద్రులకు నమస్కరించి అంతర్ధాన మయ్యారు. ఋషిగణమంతా ఆ అనాది దంపతులను తమహృదయ మందిరం లో నిలుపుకొని వారి వారి తపోవాటికల కేగారు. భక్తులంతా విందు భోజనాన్ని ఆరగించి మరలి వెళ్లారు. శివకోటయ్య సిద్ధలింగమ్మ స్వామివారి అనుమతి తీసుకొని పెదకొమెర్లకు వెళ్లారు. గోవిందమాంబా వీరబ్రహ్మేంద్రులు వీరభద్రునికి నమస్కరించి నవాబు, అన్నాజయ్య, వెంకటరెడ్డి, అచ్చమ్మలను వెంటరాగా బనగాన పల్లె చేరి, వీరప్పయ్యమఠంలో ఆది ఓంకార కూర్మ సింహాసనంపై ఆసీనులై లోకాలను పాలిస్తున్నారు.

జై వీరబ్రహ్మ జై - గోవిందమాంబ జై

భారతీయ ప్రతిభా పాటవాలు

# యంత్ర శాస్త్రం

సంకలనం: శ్రీ వివేకానంద లైఫ్ స్కిల్స్ అకాడమీ, ఫ్లాట్ నెం. 1, వెంకట్రామ నగర్ కాలనీ, ట్రాన్స్‌పోర్ట్‌రోడ్డు, కార్ఖానా, సికింద్రాబాద్ - 09. ఫోన్ : 040/27892105

ఆధునిక ప్రపంచ మనుగడ యావత్తూ యంత్రమయం. నాగరిక జీవన విధానంలో యంత్రం సహాయం లేకుండా ఏ పనీ జరగదు. దైనందిన జీవితంలో యంత్రం పాత్ర అవిభాజ్యమైనది. ఇది పారిశ్రామిక విప్లవం తరువాత మరింతగా బలపడింది. పురోగతి సాధించింది. ఇటువంటి అతిముఖ్యమైన యంత్రశాస్త్రం గురించిన భారతీయ శాస్త్రవిజ్ఞానం ఏమంటున్నది! ఇందులో మన విజ్ఞానం యొక్క స్థాయి ఏమిటి? ఒకసారి పరిశీలిద్దాం.

మన ఋషులు ఈ యంత్రముల గురించి సవివరంగా ప్రస్తావించి ఉన్నారు. 'యంత్రము' అనగా 'నియంత్రించునది' అని అర్థం. వైద్యంలో, రసాయన శాస్త్రంలో, ఆయుర్వేదాలలో, ఖగోళ శాస్త్రంలో ఇలా పలు రంగాలకు చెందిన యాంత్రిక పరికరాలను ఆనాడు మన వారు నిర్మించి, ఉపయోగించేవారు.

భరద్వాజ మహాముని యొక్క "యంత్ర సర్వస్వం" అనే గ్రంథం చాలా ప్రసిద్ధి గాంచింది. వాల్మీకి రామాయణంలో - బాలకాండ, సర్గ 5, శ్లో. 10లో నగర వర్ణన చేస్తూ యంత్రాగారాల గురించి వివరిస్తాడు. ఇక రాముడు భరతునితో "రాజప్రసాదములన్నియూ యంత్రములతో చక్కగా సంరక్షింపబడుతున్నాయి కదా" అని అడుగుతాడు. అంటే ఆ నాటికే రక్షణ వ్యవస్థలో యంత్రసామాగ్రి ఉపయోగించటం తెలిసి ఉండాలి కదా! (అయోధ్యకాండ, సర్గ 100, శ్లో. 53)

భారతంలోని "మత్స్యయంత్రం" మనకందరకు తెలిసిన ఆనాటి యంత్ర పరికరం. ఇది మన వారి విజ్ఞానానికీ, పనితనానికీ చక్కని ఉదాహరణ.

కౌటిల్యుడు తన 'అర్థశాస్త్రంలో' నగర నిర్మాణంలో, యుద్ధ రంగంలో ఉపయోగించే యంత్ర పరికరాలను గురించిన అనేక విషయాలు చెప్పి ఉన్నాడు.

శ్లో॥ దణ్డైశ్చక్రైశ్చ దన్తైశ్చ సరణి భ్రమణాదిభిః।
శక్తేరుత్పాదనం కిం వా చాలనం యన్త్రముచ్యతే॥
- యన్త్రార్ణవము

యంత్రార్ణవము అనే గ్రంథంలో యంత్రవర్ణన చేస్తూ, యంత్రంలో

దండ -Lever
చక్ర - Pulley
దంత్ - Toothed Wheel
సరణి - Inclined Plane
భ్రమణ- Screw

వంటివి ఉంటాయని, శక్తిని జనింపచేయటానికి, శక్తి దిశను మార్చడానికీ యంత్రాలను, అందులోని వివిధ భాగాలను ఉపయోగిస్తారని యంత్ర నిర్వచనం చేశాడు.

భోజరాజు తన 'సమరాంగణ సూత్రధార' అనే గ్రంథంలో ఏ యంత్రానికి ఏయే లక్షణాలు ఉండాలి. యంత్ర భాగాల పరస్పర సంబంధం, ఖచ్చితత్వం, క్షయత, శబ్దరహిత చలనం - ఇంధన సామర్థ్యం వంటి 20 లక్షణాల గురించి వివరించి ఉన్నాడు.

హైడ్రాలిక్ శక్తి ని ఉత్పత్తి చేయటంలో జలధారను

తరువాయి 27వ పేజిలో......




(గత సంచిక తరువాయి)

దిలీపుని చిరకాల వాంఛితం నెరవేరుస్తూ ఇక్ష్వాకు వంశాన్ని నిలబెట్టే గర్భచిహ్నాలు సుదక్షిణాదేవిలో పొడసూపాయి. వెన్నెలలా కన్నులకు పండువుచేస్తున్న ఆ చిన్నెలను చూచి ఆమె సఖీమణులు సంతోషించారు. మేను సన్నగిల్లడంవల్ల పరిమితమైన నగలు ధరించి లొద్దుగ పువ్వులా పాలిపోయిన మొగంతోవున్న సుదక్షిణాదేవి ప్రభాతసమయంలో కొద్దిపాటి చుక్కలతోనూ, కాంతి తగ్గిన చంద్రునితోనూ గూడిన రాత్రిలాగా రాణించింది.

వేసవిచివర తొలిచినుకులతో తడిసిన అడవిలోని పడియను మూర్కొన్న ఏనుగులాగా మన్నుదిన్న ఆమె ముఖాన్ని ఏకాంతంలో ఎంతగా మూర్కొన్నా దిలీపుడికి తనివి తీరలేదు. ఇంద్రుడు స్వర్గం పాలించినట్లు తన కుమారుడు భూతలాన్ని ఎదురులేకుండా ఏలనున్నాడని సూచించటానికి గాబోలు ఆమె రుచికరమైన ఇతర పదార్థాలు వదలిపెట్టి వట్టి మట్టి తినాలని అభిలషించింది.

మహారాజు మాటిమాటికీ ఆమె చెలికత్తెలతో "మీచెలి తనకేమి కావాలో సిగ్గువల్ల నాతో చెప్పలేకపోతున్నది. ఆమెకు కావలసిన వస్తువేదో మీరే చెప్పండి. తెప్పిస్తాను'' అని మిక్కిలి ఆదరంతో అడుగుతూ వుండేవాడు. అది స్వర్గంలో వున్నా సరే మహాశూరుడైన ఆ భూపాలుడు కోరితే దొరకని వస్తువంటూ ఏదీ లేదు. అందుచేత వేవిళ్ళతో వున్న సుదక్షిణాదేవి ఏమేమి కోరేదో, అదంతా క్షణంలో ఆమె ఎదుట ప్రత్యక్షమయ్యేది. పిమ్మట కొన్నాళ్లకు ఆమెకు వేవిళ్లబాధ తీరిపోయింది. అవయవాలు పుష్టిచేకూర్చుకున్నాయి. అప్పుడామె పండుటాకులు రాలి క్రొత్తగా చిగిర్చిన తీవలా తేజరిల్లింది.

రోజులు గడుస్తుండగా మొనలు నల్లబడి బలిసిన ఆమె కుచద్వయం తుమ్మెదలు పైన వాలిన తామరమొగ్గల కాంతి నతిశయించింది. నరపాలుడు గర్భిణియైన తన పట్టమహిషిని రత్నగర్భ అయిన భూమిలాగానూ, అగ్నిగర్భ అయిన జమ్మిచెట్టు లాగానూ, అంతర్వాహిని అయిన సరస్వతీ నదిలాగానూ భావించాడు. ఆమెపై తనకున్న ప్రేమకూ, ఔదార్యానికి, ఐశ్వర్యానికీ, పుత్రుడు కలుగనున్నాడన్న సంతోషానికీ తగ్గట్లు మహావైభవంతో పుంసవనాది కర్మలు క్రమంగా జరిపించాడు. అతడు తన యింటికి వచ్చినప్పుడు ఆమె లోకపాలుర అంశాలు ప్రవేశించివున్న గర్భభారంవల్ల చాలా ఆయాసంతో ఆసనంనుండి లేచేది. ఉపచారాంజలి కావిస్తున్నప్పుడు ఆమె చేతులు అలసిపోయేవి. ఆ చంచలాక్షిని జూచి రాజు ఎంతగానో సంతసించేవాడు. బాలచికిత్సలో నేర్పరులైన ఆప్తవైద్యులు రాణిని కాపాడుతూ వచ్చారు. మబ్బులు గ్రమ్మి వర్షింపనున్న ఆకసంలాగా నెలలు నిండి ప్రసవానికి సిద్ధంగా ఉన్న భార్యను రాజు సంతుష్టిగా చూచాడు.

**రఘు జననం**

పిమ్మట ఐదు గ్రహాలూ అస్తమించక తమ తమ ఉచ్చస్థానంలోవుండి జాతకుడు మహాభాగ్యశాలి అని

సూచించే ఒక శుభలగ్నంలో శచీదేవితో సమానురాలైన సుదక్షిణాదేవి, సాధనత్రయంతో కూడిన శక్తి అక్షయమైన అర్థాన్ని ప్రసవించినట్లు పుత్రుణ్ణి ప్రసవించింది. పిల్లవాడు పుట్టగానే దిక్కులన్నీ ప్రసన్నమయ్యాయి. గాలి హాయిగా వీచింది. అగ్ని ప్రదక్షిణజ్వాలతో హవిస్సును స్వీకరించింది. సమస్తమూ మంగళ ప్రదంగా పరిణమించింది. మహా పురుషుల పుట్టుక లోకానికి శుభప్రదం కదా! ఆ బాలకుని దివ్యతేజం పురిటి పాన్పు చుట్టూ ప్రసరించింది. ఆ వెలుగుముందు రాత్రి దీపాలన్నీ చిత్రంలోని దివ్వెలలా వెల్వెలబోయాయి. అంతఃపుర పరిజనులు వెళ్ళి రాజుకు "కొడుకు పుట్టాడు" అన్న శుభవార్త అందజేశారు. ఆ మాట వింటూనే ఆనందాతిశయంతో భూపాలుడు ఛత్రచామరాలు తప్ప చేతికందిన వస్తువుల నెల్లా వారికి కానుకగా ఇచ్చివేశాడు. గాలి తగలని పద్మంలా నిశ్చలమైన నేత్రంతో మనోజ్ఞమైన పుత్రముఖం చూస్తూ చంద్రుణ్ణి చూచి సముద్రం పొంగినట్టు దిలీపుడు ఆనందంతో ఉప్పొంగిపోయాడు.

తపోవనం నుండి వచ్చి వసిష్టమహర్షి బిడ్డకు జాతకర్మలన్నీ నిర్వర్తించాడు. సానబట్టిన మణిలాగా సంస్కారంవల్ల అర్భకుడు అధికతేజంతో ప్రకాశించాడు. వేశ్యల నృత్యాలతో సహా మంగళవాద్య ధ్వనులు వీనులవిందుగా రాజమందిరంలో విస్తరిల్లాయి. గగనంలో గూడా అప్సరసల నృత్యాలూ, దేవదుందుభుల మ్రోతలూ విజృంభించాయి. ఆ సంతోష సమయంలో ఖైదునుండి విడిపించడానికి దిలీపుని రాజ్యంలో ఒక్క ఖైదీ గూడా లేడు. అందుచేత అతడు పితౄణమనే ఖైదునుండి తన్ను తానే విడిపించుకొన్నాడు.

అటు శాస్త్రంలోనూ, ఇటు శత్రువిజయంలోనూ తుదముట్టగలడని 'రఘిఁగతౌ' అనే ధాతువు ననుసరించి కుమారుడికి దిలీపుడు 'రఘువు' అనే అన్వర్థమైన నామకరణం చేశాడు.

సూర్యకిరణాలు సోకిన బాలచంద్రునిలా అన్ని విధాలా సంపన్నుడైన తండ్రి ప్రయత్నంవల్ల మనోజ్ఞమయిన అవయవాలతో బాలుడు దినదిన ప్రవర్ధమానుడయ్యాడు. కుమారస్వామిని చూచుకొని పార్వతీ పరమేశ్వరులూ, జయంతుణ్ణి చూచుకొని శచీదేవేంద్రులూ ఆనందించినట్లే రఘువును చూచుకొని సుదక్షిణ దిలీపులు సంతసించారు. జక్క వకవలాగా హృదయావర్జకమైన అన్యోన్యానురాగం కల రాజదంపతుల ప్రేమను ఏకైక సుతుడు పంచుకొన్నాడు. అయినా వారి అనురాగం దినదినానికీ పెరిగిందేకాని తరగలేదు.

దాది పలికిన మాటలు పలకడం, ఆమె చేయి పట్టుకొని నడవడం, ఆమె నేర్పినట్లు నమస్కరించడం లాంటి పనులు చేస్తున్న కొడుకును చూచి తండ్రి పరమానందభరితుడయ్యాడు. వాణ్ణి తొడపై కూచోబెట్టుకొని అమృతం లాంటి ఆ స్పర్శతో మైమఱచి అర్ధనిమీలిత నేత్రుడై దిలీపుడు చిరకాలానికి సుతస్పర్శసుఖం అనుభవించాడు. బ్రహ్మ సత్త్వగుణ విశిష్టుడైన విష్ణునివల్ల తన సృష్టికి నిలకడ కలిగిందని తలంచినట్లే దిలీపుడు సద్గుణవంతుడైన కుమారుని వల్ల తన వంశం నిలబడిందని భావించాడు. చూడాకర్మ ముగిసిన పిదప రాకుమారుడు తన యీడు వారైన మంత్రికుమారులతో గూడి ఏటిగుండా మకరాదులు సముద్రంలో ప్రవేశించినట్లు లిపిద్వారా సమస్త సారస్వతాన్నీ సాధించాడు. తండ్రి కుమారుడికి శాస్త్రవిధి ననుసరించి ఉపనయనం కావించాడు. పాండిత్యంలో ఆరితేరిన గురువులు అతడికి విద్యలన్నీ

నేర్పారు. ఆ చదువులన్నీ అతడికి చక్కగా పట్టుపడ్డాయి. తగినచోట చేసిన ప్రయత్నం ఫలించక పోతుందా ?

సూర్యుడు వడిగల గుఱ్ఱాలతో దిక్కులను దాటినట్లు మహాబుద్ధిమంతుడైన రాజకుమారుడు వాయువేగాన్ని మించిన బుద్ధిగుణాలతో చతుస్సముద్రాలను పోలిన ఆన్వీక్షకి మొదలైన విద్యలు నాల్గింటినీ దాటాడు. పవిత్రమైన దుప్పిచర్మం ధరించి అతడు తండ్రినుండే సమంత్రకంగా ఆగ్నేయాద్యస్త్రాలను నేర్చుకొన్నాడు. అతని తండ్రి రాజత్వంలోనే కాక ధనుర్విద్యలోకూడా సాటిలేనివాడే. కోడె మహావృషభ మైనట్లూ, గున్నయేనుగు మదపుటేనుగుగా మారినట్లూ, రఘువు క్రమంగా బాల్యావస్థ గడచి యువకు డయ్యాడు. అప్పుడతని శరీరం గాంభీర్యంచేత మనోహరమై విలసిల్లింది.

దిలీపుడు పుత్రునికి కేశఖండన కర్మపూర్తిచేసి వివాహం చేశాడు. దక్షుని పుత్రికలు చంద్రుణ్ణి చేరి ప్రకాశించినట్లు రాజకన్యలు ఆ రాకుమారుణ్ణి మగనిగా పొంది శోభిల్లారు.

పొడవైన భుజాలూ, కండగల మూపులూ, విశాలమైన వక్షమూ, విపులమైన మెడ కలిగి రఘువు దేహసౌభాగ్యంలో తండ్రిని మించిపోయాడు. కాని వినయాతిశయంలో జనకుని చెంత స్వల్పుడుగానే కనిపించాడు.

పిమ్మట దిలీపమహారాజు బహుకాలంనుండీ తాను మోస్తూ వుండిన రాజ్యభారం తగ్గించుకోదలచి స్వభావంతోనూ, సంస్కారంతోనూ అణకువ గల్గివున్న కుమారుణ్ణి యువరాజుగా చేశాడు. సౌరభాది గుణాలను కోరే లక్ష్మి కమలంనుండి క్రొత్తగా విరిసిన కలువలోనికి కొంతభాగం ప్రవేశించినట్లే, వినయాది గుణాలనుకోరే రాజ్యలక్ష్మి దిలీపమహారాజునుండి కొంత భాగం క్రొంగ్రొత్త యువరాజుపై ప్రసరించింది. గాలితో గూడిన నిప్పులాగానూ, శరదృతువుతో చేరిన సూర్యుని మాదిరిగానూ, మదజలంతో కూడిన ఏనుగు రీతిగానూ, రఘువుతో గూడిన దిలీప మహారాజు సుదుస్సహమైన తేజంతో దీపించాడు.

తరువాత కొందరు రాకుమారులను తోడుగా ఇచ్చి ధనుర్ధారియైన యువరాజును హోమాశ్వాలకు రక్షకునిగా నియమించి మహారాజు తొంబైతొమ్మిది యాగాలు నిరాటంకంగా పూర్తిచేశాడు. ఆపై నూరవ యాగం తలపెట్టి అశ్వాన్ని వదలాడు. విలుకాండ్రైన కావరులు చూస్తూ వుండగానే ఇంద్రుడు అదృశ్యరూపుడై వచ్చి స్వేచ్ఛగా విహరిస్తున్న గుఱ్ఱాన్ని అపహరించాడు. అది చూచి రక్షకభటులు దిగులుపడి ఏమిచేయాలో దిక్కుతోచక ఆశ్చర్యచకితులయ్యారు. ఇంతలో ప్రసిద్ధప్రభావం గల నందనీ ధేనువు హఠాత్తుగా వారియెదుట సాక్షాత్కరించింది.

సజ్జన శ్రేష్ఠుడైన రఘువు పవిత్రమైన నందినీ మూత్రంతో కన్నులు కడుగుకొని తేరిపారజూచాడు. అప్పుడతనికి ఇంద్రియాతీతమైన పదార్థాలుగూడా స్పష్టంగా కనిపించాయి. తప్పించుకు పోవడానికి ప్రయత్నిస్తున్న హవనాశ్వాన్ని మాతలి (ఇంద్రునిసారథి) రథానికి కట్టివేయడమూ, అలా కట్టివేసిన దాన్ని ఇంద్రుడు తూర్పు దిక్కుకు మళ్ళించుకు పోవడమూ రఘువు కంటబడింది. ఱెప్పపాటులేని వందలకొలది నేత్రాలూ, పచ్చని గుఱ్ఱాలూ కల్గివున్న అశ్వాపహర్తను అతడు ఇంద్రుడని గుర్తించాడు. అతణ్ణి వెనక్కు మళ్ళించువానిలా మిన్నుముట్టే ధీరస్వరంతో ఇలా హెచ్చరించాడు.

(సశేషం)




నెమ్మాని సీతారామమూర్తి

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఆరాధన ఏకకాలంలో చేసే అవకాశం భక్తులకు దత్తాత్రేయ స్వామి ద్వారా లభించింది. ఒకసారి దత్తుణ్ని పూజిస్తేచాలు వేయి సార్లు త్రిమూర్తులను పూజించిన ఫలం దక్కుతుందని ధర్మశాస్త్రాలు చెప్తున్నాయి.

"మార్గశిర పూర్ణిమ దత్తాత్రేయ జయంతి రోజు ఈ ఫలితం 10 వేల రెట్లు ఎక్కువగా ఉంటుందని స్వయంగా నారద మహర్షే పేర్కొన్నాడు.

భాగవతం ప్రకారం - "దత్తోమమా హమితి యద్భగవాన్ సదత్తః"

భగవంతుడే తనని తాను పుత్ర రూపంలో ప్రసాదించుకొనిన ఘట్టం అతి రమణీయమైనది. అలా ఇచ్చుకోబడిన కారణంచేత ఆయన 'దత్తు' డయ్యాడు. అత్రి కుమారుడవటం చేత ఆత్రేయుడయ్యాడు. రెండు నామాలు కల్గి " దత్తాత్రేయుడిగా మారాడు. ఇది గురు స్వరూపం. జ్ఞానమోక్ష మార్గ స్వరూపం. ప్రధానంగా నారాయణుడై, తదుపరి బ్రహ్మ రుద్రాత్మకుడై, త్రిమూర్తుల స్వరూపంగా ఆరాధ్యుడైనాడు. ఎందరో మహామహూలు ఆయన అనుగ్రహం పొందారు.

కార్త్యవీర్యార్జున వృత్తాంతం

పూర్వం హైహయ వంశంలో కృతవీర్యుడనే రాజు ఉండేవారు. ఆయనకు ఎంతకాలానికి సంతానం కల్గలేదు. మహారాణి ఎన్నెన్నో నోములు నోచగా ఒక బిడ్డ పుట్టాడు. అతని పేరు కార్యవీర్యార్జునుడు. అతనికి చెతులు లేవు. రాజు దంపతుల దుఃఖానికి అంతులేదు. అతను పెరిగి పెద్దయ్యే కొద్ది వారి వేదన మరింత ఎక్కువైంది. అవిటివాణ్ణి యువరాజును చేసేందుకే మంత్రులు మొగ్గుచూపారు. అయితే "కార్త్యవీర్యార్జునుణి అంగీకరించలేదు. తాను తపస్సు చేసి చేతులు సంపాదించుకుంటానని తల్లిదండ్రులను ప్రాధేయపడ్డాడు. అప్పుడే వారి కులగురువు 'గర్గముని' "సహ్యాద్రి పర్వతాలలో ఆశ్రమ వాసుడిగా ఉన్న దత్తాత్రేయుడిని ఆశ్రయించిన ఫలితం లభిస్తుందని చెప్తాడు.

సుముహూర్తంతో శ్రీకారం

కార్త్యవీర్యార్జునుడే ఒక మంచి క్షణంలో సత్యా పర్వతానికి వెళ్ళి, ఋషి వేషధారణతో ఆశ్రమంలో ప్రవేశించాడు. మరకత మణిమయమైన శిలా వేదికపై మద్వతే మధపాన గోష్టిలో ఉన్న దత్తుని కాళ్ళపై పడి తన గోడుని చెప్పుకున్నాడు. "మాయను" జయిస్తేనే దత్తుడు అందుతాడు. పుట్టిన ప్రతి మనిషిని మాయా ప్రపంచం బంధించి వేస్తుంది. దానిని తొలగించుకోవాలంటే గురువు అనుగ్రహం ఉండాలి. దత్తుడు తన వద్దకి వచ్చేవాళ్ళ ఆత్మశక్తిని పరీక్షించేందుకే మదవతే, మధులోలుడుగా కన్పిస్తాడు. మనం ఆయన బాహ్యరూపాన్ని చూసిభ్రమిస్తే, అంతటితో ఆగిపోతాము. అవన్నీ మనల్ని మాయా విజేతలను చేసేందుకు స్వామి లీలలని గ్రహిస్తేచాలు. ఆత్మసాక్షాత్కరం పొందుతాము. " అప్పుడు త్రిమూర్తుల స్వరూపమైన నిజ గురు అనుగ్రహం లభిస్తుంది".

"గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః

దీన్ని తెలియజేప్పటమే దత్తాత్రేయ అవతార రహస్యం ఇదే రీతిలో కార్త్యవీర్యార్జునుడు మాయను జయించాడు.

వేయి బాహువులు ఆవిర్భావం

ఒకసారి దత్తాత్రేయస్వామి కార్త్యవీర్యార్జునిడి ఒళ్ళో తలపెట్టుకొని నిద్రిస్తున్నాడు. దతుడి అపానవాయువు సెగలకి కార్త్యవీర్యార్జుని చేతులు కూడా కాలిపోయాయి.

చూశావా! కార్త్యవీర్యా నేనేమీ దివ్యశక్తి సంపన్నుడినికాదు. వ్యసనాలతో తేలియాడుతున్న దుర్జనుణ్ణి. నన్ను విడిచి వెళ్ళు అంటాడు దత్తుడు. అయిన కార్త్యవీర్యార్జునుడు స్వామిలీలలలో ఇది ఒక్కటిగా భావించి స్వామి మీ సేవలో చేతులేకాదు, ప్రాణాలు పోయిన పర్వాలేదు. మీరే నా సర్వస్వం. నా దైవం. అంటూ కాళ్ళమీద పడి ఏడవసాగెను. అప్పుడు దత్తాత్రేయస్వామి తన నిజస్వరూపాన్ని ప్రకటించి కార్త్యవీర్యార్జునుడుకి వెయ్యి చేతులు, అష్ట సిద్ధులు సకలైశ్వర్యాలు ప్రసాదించారు.

గురువు అనుగ్రహించే వరకు

దీనినిబట్టి మనకు తెలిసేదేమిటంటే గురువు కటాక్షం అంత తొందరగా లభించదు. లభించేవరకు మన ప్రయత్నం విరమించకూడదు. ఒక్కసారి గురువు మనల్ని కరునించాడో మన సమస్త బాధలు పటాపంచలై పోతాయి.

నమోస్తు తస్మై పరిశుద్ధ బుద్ధియే
విశుద్ధ విజ్ఞాన ఘనాయ సాక్షిణే.

---

తరువాయి 22వ పేజిలో......

ఉపయోగించే విధానాన్ని సమరాంగణ సూత్రధార 31వ అధ్యాయంలో చెప్పబడింది.

అలాగే "సూర్యసిద్ధాంతం"లో యంత్రాధ్యాయం లోని 53 నుండి 56 వరకూ గల శ్లోకాలలో జలచక్రం గురించిన వర్ణన ఉంది.

చివరగా భరద్వాజుని "యంత్ర సర్వస్వం"లో 31 రకాల యంత్రాలను, విమానంలో వాటి స్థానం, అవి నిర్వహించే పనినీ పేర్కొన్నారు. వానిలో విమానం పరిసరాలను విమానంలో నుంచే చూడగలిగే 'విశ్వక్రియా దర్పణం'. దిక్కులను సూచించే "దిశాదర్శి" శత్రు విమానాలను పసిగట్టి పక్కకు తప్పుకోగలిగే "వక్ర ప్రసారణ యంత్రం" వంటివి ఉన్నాయి.

జి.ఆర్. జోష్యర్ రచించిన "డైమండ్స్, మెకానిజమ్స్, వెపన్స్ ఆఫ్ వార్, యోగసూత్రాస్" అనే గ్రంథంలో ఎన్నో రకాలయిన ఇంధనాలతో నడపబడే యంత్రాల గురించి వివరింపబడి ఉంది. వాటిని చదివితే "భాస" మహాకవి రచించిన స్వప్న వాసవదత్త అనే సంస్కృత నాటకంలో ఉదయిన మహారాజుని జయించడానికి ఉపయోగించిన ఏనుగును పోలిన కృత్రిమ యంత్రం నిజమే అనిపిస్తుంది.

- కణాద మహర్షి తన 'వైశేషిక దర్శనం'లో ఐదు రకాల క్రియల గురించి చెప్పాడు. ఇవన్నీ కూడా ఈనాటి ఆధునిక యంత్ర చలనాలకు సంబంధించినవి.

- ప్రశస్తపాదుడు 'వైశేషిక దర్శనానికి' భాష్యం రచించాడు. అందులో కొన్ని 'గతి సూత్రాలను' సూత్రీకరించాడు.

ఇది న్యూటన్ కంటే దాదాపు వేయి సంవత్సరాల ముందు కాలం నాటిది. అంతటి విలువైన యంత్ర విజ్ఞానం వెల్లివిరిసిన భారతావనిలో, ఆ తరువాత ఆ జ్ఞానం కనుమరుగు కావటం ఆశ్చర్యం కలిగిస్తుంది. కాల మహిమను ధృవపరుస్తుంది.

# సనాతన ధర్మము - దాని విశిష్ఠత

...... స్వామి ముకుందానంద సరస్వతి, ఋషికేష్: 09410990829

## విధ్యుక్త కర్మాచరణ

వేద సమ్మతమైన కర్మను 'విధ్యుక్త కర్మ' యందురు. వేదస్మృతి, పురాణేతి హాసములలో విధింపబడిన కర్మలనే మానవుడాచరించవలయుననియు, తద్విరుద్ధ కర్మలను త్యజించవలయుననియు సనాతనధర్మము ప్రబోధించుచున్నది.

మానవునకు కర్మయేే ఫలము నిచ్చును. కర్మననుసరించి ఫలముండును. శుభ కార్యముల నొనర్చిన శుభఫలమును, అశుభకార్యములనొనర్చిన అశుభఫలమును మానవుడు పొందును. దానినే మనుస్మృతి చక్కగా వివరించినది.

**శ్లో॥ శుభాశుభ ఫలం కర్మ మనోవాగ్దేహ సంభవమ్।**

**కర్మజా గతయో నృణాముత్తమాధమ మధ్యమాః (మను. 12-3)**

'మనోవాక్కాయ కర్మలచే శుబాశుభ ఫలములు లభించుచున్నవి. మంచి, చెడు మిశ్రమ ఫలములు కర్మపై ఆధారపడియున్నవి.'

కావున, మానవుడు శుభకార్యాచరణ వలన మంచి ఫలమును పొందునని నిశ్చయింపబడినది. శుభకర్మలనగానేమి యను విషయమును క్రింది శ్లోకము వివరించుచున్నది.

**శ్లో॥ వేదోదితం స్వకం కర్మ నిత్యం కుర్యాదతంద్రితః।**

**తద్ధి కుర్వన్యథాశక్తి ప్రాప్నోతి పరమాం గతిమ్॥ (మను. 4-14)**

'వేదములచే విధింపబడిన స్వకర్మలను మానవుడు ఎల్లప్పుడు ఆచరించవలయును. అటుల యథాశక్తి ఆచరించుట వలన పరమపదము ప్రాప్తించును.

విద్యుక్త కర్మను ఎట్టి పరిస్థితులలోను ఆచరించవలయుననియు, నిషిద్ధ కర్మను ఎటువంటి విషమ స్థితిలోనైనను త్యజించియేే తీరవలయుననియు సనాతన ధర్మము బోధించుచున్నది.

**శ్లో॥ అకర్తవ్యం నకర్తవ్యం ప్రాణైః కంఠగతై రపి।**

**కర్తవ్యమేవ కర్తవ్య మితి ధర్మవిదో విదుః ॥**

'నిషిద్ధకర్మను కంఠమువరకు మునిగిపోయి ప్రాణముల మీదికి వచ్చినప్పటికి చేయరాదు. విధ్యుక్త కర్మను ప్రాణములు పోవు పరిస్థితి సంభవించినప్పటికి చేసియేే తీరవలయును. ధర్మవిదులు (ధర్మమును తెలిసినవారు) దానిని (విధ్యుక్త కర్మను) ఆచరించుటయందే నిలకడ కలిగియుండవలయునని తెలియుదురు'.

విద్యుక్త కర్మాచరణ వలన లభించు శుభఫలములను మనుస్మృతి వివరించుచున్నది.

**శ్లో॥ తేషు సమ్యగ్వర్తమానో గచ్ఛత్యమరలోకతామ్।**

**యథా సంకల్పితాం శ్చేహ సర్వాన్కామా న్సమశ్నుతే॥ (మను.2-5)**

'విధ్యుక్త కర్మలను సక్రమముగా ఆచరించుట వలన మానవుడు పరలోక అమృతత్వమును, ఇహలోక కామ్యార్థములను పొందగలడు'.

మరియు, విద్యుక్త కర్మల నాచరించుట వలన మానవుడు ఈ ప్రపంచములో కీర్తిని, పరలోకములో సుఖములను బడయుగలడని మనుస్మృతి ప్రబోధించుచున్నది.

తరువాయి 37వ పేజిలో......

# యోగవాసిష్ఠ కథాలహరి

డా॥ ధారారామనాధశాస్త్రి, ఒంగోలు

భోగ, యోగసీమా భూమి భార్గవులు

అది మందర పర్వతం. ఆకాశపర్యంతం ఎదిగిన ఠీవి, అనన్య గాంభీర్యం, ఏపుగా పెరిగిన ఆరణ్యక ప్రకృతి, సెలయేళ్ళు, వన్యమృగాలు ఒకటేమిటి ? ఉత్తమ గిరీంద్ర లక్షణాలన్నీ పొందుపడి మహర్షుల తపశ్చర్యకనుకూలంగా సిద్ధ కిన్నెర కింపురుషాది వేల్పుజాతుల విహరణ భూమిగా సౌందర్యానికి సీమా భూమిగా అలరారుతున్నది. అందులో ఒక ఉత్తాల గంభీర ఉపత్యక మీద బహుకాలంగా భృగుమహర్షి తపశ్చర్య నిర్వహిస్తున్నారు. కుమారుడు శుక్రుడు పితృదేవులపట్ల వినయ విధేయతలతో వినమ్రుడై భృగువును సేవిస్తున్నాడు. హోమాది కార్యక్రమాలకు వస్తుసేకరణ నుండి అన్నిటా తానై అమరికలు చేస్తూ తానున్నూ యధోచిత తపశ్చర్య నెరపుతూ తాతపాదులు సెలవిస్తున్న తత్త్వాన్ని ఆకళింపు చేసుకొంటూ జీవిస్తున్నారు. అసలే స్ఫురద్రూపం, ఆపైన బ్రహ్మతేజం, అటుపైన యమనియమాది సాధనలచే పరిపక్వమైన దేహం, నిరంతర జిజ్ఞాసువులైన మనస్సుకల భార్గవులు తండ్రి కల్లారుముద్దుగా ఎల్లర మురిపాల హద్దుగా మసలుతున్న వేళ ఓనాడు తండ్రిగారికి కావలసిన ఆహ్నిక సంభారాలు చేకూర్చి తాను మధ్యాహ్నికం సైతం ముగించుకొని ఓ అందమైన కొండచరియ మీద రవంతసేపు మునిరాట్టు విశ్రమింపగా...

గగన తలాన మధుర మంజుల మనోహర సంగీత నృత్య విలాస విభ్రమాలతో అపూర్వ సౌందర్యంతో భాసిస్తున్న ఒక అప్సరాంగన అలాఅలా వెళుతుంటే చూచిన శుక్రుని మనస్సు చిత్తము ఆమాటకు వస్తే సర్వస్వమూ అట్టిట్టై తట్టుకొనలేక ఆబుషి కిశోరము అప్సరసను అనుగమించి, లాలించి, ప్రాధేయపడి, అంతరంగంలోని శృంగార వాంఛని వ్యక్తం చేయగా...

ఆమె కూడా కణకణ మండుచున్న నిప్పులాంటి బ్రహ్మతేజంగల ఆ శుక్రుని చెంత ఎక్కువ బెట్టుచేయక బిట్టు మక్కువతో అతని వలపు కౌగిలిలో ఒదిగిపోయింది. అటుపైన శృంగార సాగరం పోటెత్తింది. ఏళ్ళూ, పూళ్ళూ గడిచాయి. చరిత్రలో పది శతాబ్దాలు దొర్లిపోయాయి.

ఒకనాటి నెర సంజ భృగువు చిర తపస్సమాధి నుండి యీవలకు వచ్చారు. బ్రహ్మానందానుభూతితో నిర్వికల్ప సమాధి స్థితిలో పెక్కేళ్ళు గడిపిన మునీంద్రులు అలవోకగా కన్ను తెరచి చూచారు. అల్లంతదూరాన పడియున్న శవం. దగ్గరగా వెళ్ళి చూశారు. అది తన కుమారుడైన శుక్రునిది. భృగుమునీంద్రుల హృదయంలో శోకసాగరం పోటెత్తింది. తట్టుకోలేక కుప్పకూలి తెలివితప్పి కొంచెం సేపటికి తేరుకొని ఆలోచనామగ్నులై శోకాగ్నిని, క్రోధాగ్నిగా మార్చుకొని యమధర్మరాజుపై కన్నెరచేయగా...

సమవర్తి వినమ్రుడై మునీంద్రుల ఎదుట నిలిచి నమస్కరించి క్రమదశలో ఆయన క్రోధాగ్నిని చల్లార్చి సంభాషణకు ఉపక్రమించారు యమధర్మరాజు అన్నాడు.'మహాత్మా! మీరు మునీంద్రులు. చిరతపస్సమాధి నుండి యిటీవలే యివతలికి వచ్చిన జ్ఞానమూర్తులు. మీకు చెప్పదగిన వాడనుకాను. అయినా ఇంచుక ఆలోచించండి మహర్షీ. మానవుడు చిత్తస్వరూపుడు. చిత్తప్రభూతమైన సంకల్పం నిజంగా ప్రవర్తిల్లుతూ చిత్తము దృశ్యకల్పనచేత బంధింపబడుతుంది. జీవితాలు, శరీరాలు జన్యజరామృత్యువులూ, అన్నీ కూడా చిన్నపిల్లలు

మట్టిబొమ్మలతో ఆడుకొనే ఆటలవంటివి. ఒక బొమ్మతో కాసేపు ఆడుకొని పిల్లలు ఆ మట్టిని పిసికి వేరే బొమ్మచేసుకొని ఆడుకోవడంలేదూ, అలాంటిదే బ్రతుకు కథ. దీనికి అతీతంగా సమస్త జగత్తు కేవలం బ్రహ్మము అని భావించడం ముక్తి హేతువు. మునీంద్రా! మీరు నాతోరండి. ఒక విచిత్ర దృశ్యం చూపిస్తాను.' అంటూ మహర్షిని వెంటబెట్టుకొని యమదేవుడు తత్ప్రాంతమున వున్న సమంగ అనే పేరుగల నదీతీరానికి తీసుకొని వెళ్ళాడు.

సమంగా నదీతీర స్థలమైన ఒక మున్యాశ్రమం దగ్గరకు ఇరువురు చేరారు. ఆశ్చర్యం. అపుడు శుక్రాచార్యులు బ్రహ్మజ్ఞాన తేజోమూర్తియై విరాజిల్లుతూ తపస్సమాధి యందున్నారు. పరిసరాన భార్య, ఒక బ్రాహ్మణ కన్య నిలిచి తన స్వామికి వింజామరం వీస్తూన్నది. కొద్ది క్షణాలు గడిచేక శుక్రులు కనులు తెరిచి పితృపాదులకూ, యమధర్మరాజుకి యధోచిత స్వాగతాదులు నెరపారు. కొంతసేపు మువ్వురూ ఇష్టాగోష్ఠిలో ప్రవర్తిల్లిన అనంతరం శుక్రుడు అన్నాడు. 'నాన్నగారు! సమవర్తీ! మహనీయుల దర్శనం వల్ల కలిగే సుఖశాంతులు అమృత వర్షంచేత కూడా లభించవు. మీరాకచే నేను ధన్యుడను. నేను అనేక జన్మలలో చిరకాలం శ్రమపడి ఇపుడు విశ్రాంతి పొందేను. చూడదగినదంతా చూచేను. తెలిసికొన దగినదంతా తెలుసుకొన్నాను. రండి నాన్నగారు మనమందరము మన మందర పర్వత ఆశ్రమం దగ్గరకు వెళ్దాం' అంటూ త్రోవతీశాడు. అపుడు ఆకులచే కప్పబడి కర్పూరాది సుగంధ ద్రవ్యాలచే రక్షింపబడుతున్న తన శవాన్ని చూపి చూడండి నాన్నా! ఒకప్పుడు సర్వాలంకరణ భూషితమై దేవతా స్త్రీలచేత లాలింపబడి భోగసీమగా విరాజిల్లిన యీ దేహం క్రిమికీటకాలకు ఆహారంకాకుండా మన యింటి దాది దీనిని ఇలా రక్షించింది. ఇంకొక విషయం గమనించండి. ఇప్పుడీ శరీరానికి చిత్తమువల్ల సంక్రమించే భ్రమ ప్రమాదాలు వైక్లబ్యబాంధవ్యాలు లేవు. హాయిగా అలా పడివున్నది. పెద్దలారా! మానవుడు తన జ్ఞానేంద్రియములతో అసక్తుడుగాక తటస్థుడుగా వుండి కర్మేంద్రియ ప్రకృతులతో సక్తుడైనా అతడు ముక్తుడే అవుతాడు. చిత్తం చేత సృష్టింపబడిన సమస్త దృశ్యమాలికలోనూ తను చిక్కుకొనరాదు. నాన్నా! ఇవి మీకు తెలీనివికావు. అలాగే యీ సమవర్తి మాత్రం సామాన్యుడా! సమస్త విజ్ఞాన వర్తి. మీవంటి పెద్దల దగ్గర నా యీ అనుభూతిని నివేదించుకున్నాను. అంతమాత్రమే.'

అంటూ తన శవంలోకి తాను ప్రవేశించి లేచి నిలబడ్డాడు. పూర్వము వలెనే యౌవనశోభ, బ్రహ్మతేజము, పరమాద్భుత సౌందర్యము అనే లక్షణాలచేత విరాజిల్లుతున్న కుమారుని భృగువు, దగ్గరకు తీసికొని కౌగిలించుకొని మూర్ధాఘ్రాణం చేసి "సాధూ నాయనా! సాధు" అని తన ఆశ్రమం దిక్కు అడుగులు వేస్తున్నాడు. శుక్రాచార్యులు తండ్రిని అనుగమిస్తున్నారు. యమధర్మరాజు అదృశ్యుడైనాడు.

ఈ కథను విషణ్ణచిత్తుడైన రామచంద్రునికి చెప్పిన శ్రీవసిష్ఠులు అంటున్నారు. నాయనా! కథ విన్నావుగా చిత్తఫలితంగా దృశ్యకల్పన దానిలో చిక్కుకున్న స్థితులకు ప్రతీకలైన ఋషుల కథయినది. సమస్తమూ చిత్తకల్పనకు చిత్రం లాంటిది. అందులో ఎన్నో దృశ్యాలు జాగ్రత్త.

చిత్రామృతం నామృతమేనవిద్ధి
చిత్రానలం నానలమేమ విద్ధి
చిత్రాంగనామాన మనజ్ఞనేతి
వాచా వివేకస్త్వవివేక ఏవ॥

బొమ్మలో అమృతం అమృతం కాదు. అగ్ని అగ్నికాదు. అంగున అంగున కాదు. అలాగే వాచావివేకము వివేకం కాదు. అంటే చిత్తవృత్తి నిరోధం వల్ల కలిగే వివేకము, అంటే బ్రహ్మజ్ఞాన సంపత్తి మాత్రమే నిజమైన వివేకము. అలాంటి వివేకము నీకు లభించునుగాక! అంటూ ఆశీర్వదించి ముగించారు.

....

గీతా సుధ



# భగవద్గీతకు భాసుర భాష్యం

డా॥ రాధశ్రీ, కర్నూలు, ఫోన్: 9494481210

(గత సంచిక తరువాయి)

**మృత్యుఃసర్వహరశ్చాహముద్భవశ్చ భవిష్యతామ్**
**కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా (10-34)**

సామ వేదశాఖల్లో బృహత్సామాన్నీ, ఛందోబంధురమైన ఋక్కులలో గాయత్రీ ఛందాన్నీ, మాసాలలో మార్గశిర మాసాన్నీ, ఋతువులలో వసంత ఋతువునూ నేనే!!

**బృహత్సామ తథా సామ్నాం, గాయత్రీ చంధసామహమ్**
**మాసానాం మార్గశీర్షోఽహమృతూనాం కసుమాకరంః (10-35)**

ఆటల్లో జూదాన్నీ, పరాక్రములలోని పరాక్రమాన్నీ, ప్రయత్నంలో విజయాన్నీ, నిర్ణయం తీసుకునే వారిలో నిర్ణయాన్నీ, సాత్వికులలోని సత్వగుణాన్నీ నేనే!!

**ద్యూతం ఛలయతామస్మి, తేజస్తే జస్వినామహమ్**
**జయోఽస్మి వ్యవసాయోఽస్మి, సత్త్వం సత్త్వవతామహమ్ ॥ (10-36)**

వృష్ణి వంశస్తులలో వాసుదేవుణ్ణీ, పాండవుల్లో అర్జునుణ్ణీ, మునుల్లో వ్యాసుణ్ణీ, కవుల్లో శుక్రుణ్ణీ నేనే!! అంటే ఈ గీత చెప్పిన కృష్ణుడు, విన్న అర్జునుడు, వ్రాసిన వ్యాసుడు అన్నీ గీతా చార్యుడేనన్న మాట!

అంటే చెప్పినా, విన్నా, వ్రాసినా అది ప్రథమ శ్రేణిలో ఉండాలన్న మాట. చెప్పే వాడూ, వినేవాడూ, వ్రాసేవాడూ కూడా పరమోన్నత గుణులైతేనే ఆ కావ్యం నిశ్చయంగా నాలుగు కాలాల పాటు నిలచి శాశ్వతత్వాన్ని సంతరించుకుంటుందన్నమాట!

**వృష్ణీనాం వాసుదేవోఽస్మీ పాండవానాం ధనంజయః**
**మునీనామవ్యహం వ్యాసః కవీనాముశనా కవిః !! (10-37)**

శిక్షించు వాడిలో దండనా శక్తినీ, జయాభిలాషుల్లోని నీతిని, రహస్య వస్తువులలో మౌనాన్నీ, జ్ఞానులలోని జ్ఞానాన్ని నేనే!!

**దండో దమయతామస్మి, నీతిరస్మి జిగీషతామ్**
**మౌనం చైవాస్మి గుహ్యానాం, జ్ఞానం జ్ఞానవతామహమ్ (10-38)**

అన్నీ జీవితాలనూ పుట్టించేది నేనే. జీవింపచేసేది నేనే. మరణింపజేసేదీ నేనే. మరలా పుట్టించేదీ నేనే. ఈ జనన మరణ చక్రాన్ని తిప్పేదీ నేనే. చరాచర వస్తు జాలాలల్లో నేనే లేనిది లేదు.

**యచ్చాపిసర్వభూతానాం బీజం తదహమర్జున**
**న తదస్తివినా యత్‌మయా భూతంచరాచమ్ (10-39)**

ఇప్పటిదాకా నేను చెప్పిన వన్నీ, ఉదాహరణలు మాత్రమే. నా దివ్య రూపాలకు అంతంలేదు. శ్రేష్టమైనదంతా నేనే. అంటే సంపూర్ణమైన 'పని' కి రూపాన్ని నేను.

**నాంతోఽస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప**
**ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరో మయా (10-40)**

సంపన్నం, వైభవం గల సృష్టి అంతా నాదే, నేనే. (కాబట్టి భగవంతుడు ప్రసాదించిన సౌందర్యాన్నీ, వైభవాన్నీ పాడుచేయకూడదు. ఏదేనా సహజంగా భగవత్ప్రసాదితంగా ఉన్నప్పుడే అందంగా ఉంటుంది. 'ముక్కు' బాగాలేదని ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్న వాళ్లను చూచి ఎంతో బాధగా ఉంటుంది. ఏదో యాక్సిడెంటయి ప్లాస్టిక్ సర్జరీ చేయడం వేరు,

కావాలని అందంగా కనబడాలని - ముక్కు కోసుకోవడం వేరు (అవునో కాదో పాఠకులే నిర్ణయించుకోవాలి).

**యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా**
**తత్తదేవాగచ్ఛ త్వం మమ తేజోఽంశ సంభవమ్ (10-41)**

ఇన్ని రకాలుగా నా ఉనికిని నీకు చెప్పినాను కదా! ఇదంతా తెలుసుకొని నీవు ఏమి చేయగలవు ? ఒక్క మాటలో చెప్పాలంటే నేను అంతటా వ్యాపించి ఉన్నాను.

**అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున**
**విష్టభ్యాహమిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్ (10-42)**

ఊరకనే తెలుసుకొని ఏం చేస్తావు ? దానిని అవగతం చేసుకోవాలి. ఒట్టినే బట్టీపట్టి పరీక్షా పత్రం మీద వాటిన "కుక్కితే" ఏ జ్ఞానం సంపాదించినట్లు ? "పంథొమ్మిది పంథొమ్ముదులు ఎంత" అనగానే "నాకు పెద్దెక్కాలు రావండీ" అంటారే తప్ప దానికి ఎలా పరిష్కారం దొరుకుతుందీ అని ఆలోచించరు. పంథొమ్మిది పంథోమ్ముదులు రావు సరే - ఇరవై పంథొమ్ముదులు (19×20) చాలా తేలికగా తెలుస్తాయి కదా అందులో నుంచీ ఒక పంథొమ్మిది తీసేస్తే సరి అనే జ్ఞానం కూడా చాలా మందిలో ఉండదు. ఇరవై పంథొమ్ములు 380 కాబట్టి

మనకు 19 పంథొమ్ముదుల విలువ కావాలి కాబట్టి 380 లో నుండి ఒక 19 తీసివేసి ఆన్సరు 361 అని నోటితో చెప్పవచ్చు. క్యాలిక్యులేటరు, కంప్యూటరు పుణ్యమా అని ''రెండురెళ్లు ఎంత'' అంటే "క్యాలిక్కులేటరు మీద వేసి చెబుతాం సార్" అనే విధంగా తరం తయారు అవుతున్నదనేదే ఈ భాష్యకారుడి బాధ.

**తే.గీ. రెండు రెళ్లకు క్యాలిక్కు లేటరడిగి**
**మూడుమూళ్లకు మంచి కంప్యూటరడిగి**
**నాల్గు నాల్గుల నడుగగా నాల్కవెళ్ల**
**బెట్టు ప్రజల పైనెట్ల ప్రీతి గలుగు**

ఇదే మాట 10వ అధ్యాయం చివరిదాకా వచ్చి శ్రీకృష్ణుడు అర్జునుణి అడిగాడు. "ఉత్తినే తెలుసుకొని ఏం చేస్తావు -. ఆచరణలో పెట్టు' అన్నాడు. అసలు జ్ఞానం కన్నా ఆచరణే ముఖ్యం. అందుకే గీత మన రాతలను మార్చే గీత అయింది. పాండిత్యం కన్నా ఆచరణే ముఖ్యం. ''మధ్యపాన నిషేధం'' మీద అనర్గళంగా నాలుగు గంటలు ఏకబిగిన మాట్లాడే మహాత్ముడు నాలుగు పెగ్గులు బిగించి మరీ మైకు అందుకుంటాడు. ఇలాంటి వాళ్ల వల్ల జాతికి ఏమి ఉపయోగమో ఆలోచించండి!

గీతలోని 701 శ్లోకాలు వల్లె వేసే వారు, ఆచరణలో శూన్యమనస్కులైతే ఏం ఉపయోగమో చెప్పండి! అందుకే గీత 'ఆచరణ'ను ప్రోత్సహిస్తుంది. అర్జునుడికి యుద్ధం చేయడం (థీరిటికల్‌గా) సిద్ధాంత పరంగా తెలుసు. కానీ ఆచరణలో మాత్రం చేతకాకపోయె! అందుకే కృష్ణుడు కర్తవ్యోన్ముఖుణ్ణి చేయడం కోసం ఇంతగా చెబుతున్నాడు. కనీసం ఇప్పటి నుండైనా మనం "ఆచరణ" లో ముందుంటాంగాక!!

ఈ విధంగా మనం 10వ అధ్యాయాన్ని సుసంపన్నం చేసుకొని వచ్చే సంచిక నుండి 11వ అధ్యాయమైన ''విశ్వరూప సందర్శన యోగాన్ని'' ప్రారంభించు కుందాం. రాష్ట్ర రాష్ట్రేతర చదువరుల నుండి అసంఖ్యాకంగా వచ్చిన, వస్తున్న ఫోన్లు, ఉత్తరాలు, సంక్షిప్త సందేశాలు నన్ను మరింత ఉత్సాహపరుస్తున్నాయి. అందుకే పాఠకులకు, కాలజ్ఞానసుధ పండిత మండలికి శతసహస్ర వందనాలు.

# అష్ట వినాయకులు

## 7. విఘ్నరాజు

.... కీ.శే. డా॥ రోహిణి వెంకట సుందరవరదరాజేశ్వరి

**విఘ్నరాజావతారశ్చ శేషవాహన ఉచ్యతే।**
**మమతాసుర హన్తా స విష్ణు బ్రహ్మేతి వాచకః॥**

శ్రీ గణేశ భగవానుని విఘ్నరాజ నామావతారము బ్రహ్మవిష్ణు వాచక స్వరూపమైనది. శేషవాహనముపై వెళ్ళువాడు, మమతాసుర సంహారకుడు.

ఒకానొక సమయమున భగవతి పార్వతీ మాత తన సఖియలతో మాట్లాడుచూ నవ్వెను. ఈమె నవ్వు నుండి ఒక పురుషుడు జన్మించెను. ఇతడు చూచుచుండగానే పర్వతాకారుడయ్యెను. పార్వతి వీనికి మమతాసురుడని పేరుపెట్టెను.

పార్వతి వీనితో "నీవు గణేశుని స్మరింపుము. దీని వలన నీకు సమస్తము ప్రాప్తించును" అని "షడక్షర" (వక్రతుండాయహుమ్) మంత్రమును ఉపదేశించెను. మమతాసురుడు తల్లి చరణములకు ప్రణామము గావించి తపమొనరించుటకు వనమునకు వెళ్ళెను.

అచట ఇతనికి శంబరాసురునితో స్నేహమయ్యెను. ఇతడు మమతాసురునకు సమస్త ఆసురీ విద్యలను నేర్పెను. ఆ విద్యాభ్యాసముతో మమతాసురునకు సమస్త ఆసురీ శక్తులు ప్రాప్తించెను.

శంబరాసురుని ప్రేరణతో మమతాసురుడు తపస్సు చేయసాగెను. కేవలము వాయువుతో విఘ్నరాజుని వెయ్యి సంవత్సరములు ధ్యానించెను. ప్రసన్నుడైన గణనాధుడు ప్రకటమయ్యెను.

మమతాసురుడు విఘ్నరాజు చరణములను భక్తితో పూజించి "ప్రభూ! నాపై ప్రసన్నులైన బ్రహ్మాండ రాజ్యమును ప్రసాదింపుడు. యుద్ధమందు ఎట్టి విఘ్నములు నాకు కలుగరాదు. శివాది భగవానులకు అజేయుడనై యుండవలెను" అని కోరుకొనెను.

విఘ్నరాజ భగవానుడు "దైత్యరాజా! నీవు అసాధ్యమైన వరమును కోరుకొంటివి. అయిననూ వరమొసగుచుంటిని" అని అనెను.

వరము పొందిన మమతాసురుడు, శంబరాసురుని గృహమునకు వెళ్ళెను. విషయమును తెలిసికొనిన శంబరాసురుడు సంతోషించి తన పుత్రిక మోహినిని మమతాసురునకు ఇచ్చి వివాహము చేసెను. అనంతరము శుక్రాచార్యుడు మమతాసురుని దైత్యులకు రాజుగ నియమించెను.

ఒక రోజు మమతాసురుడు శుక్రాచార్యునితో "తనకు విశ్వమును జయించవలెనని కోరికగాయున్నద"నెను.

శుక్రాచార్యుడు "రాజా! విశ్వమును జయించుము. కాని విఘ్నేశ్వరునితో మాత్రము విరోధము వలదు. విఘ్నరాజుని కృపవలననే నీకు ఈ శక్తి వైభవములు లభించినవి" అని అనెను.


అనంతరము మమతాసురుడు తన సేనలతో కూడి భూలోకమును పాతాల లోకములను జయించెను. ఆ తరువాత స్వర్గముపై కెళ్ళెను. ఇంద్రునితో భీషణ సంగ్రామము జరుగసాగెను. రక్తము నదివలె ప్రవహించసాగెను. అయిననూ దేవగణములు నిలువలేకపోయిరి. స్వర్గము మమతాసురుని స్వాధీనమయ్యెను. యుద్ధమందు విష్ణువును,

తరువాయి 37వ పేజిలో......

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలలో

# దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు

## మడ అడవులు (ఆంధ్రప్రదేశ్ - తూర్పుగోదావరి)



శ్రీ రోహిణి మహేష్, M.A., L.L.B., కన్నావారి తోట 2వ లైను, 27-9-54, గుంటూరు - 522 004

మడ అడవులు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో గోదావరినది గౌతమి, వైనతేయం, వశిష్టపాయలుగా విడిపోయి సముద్రంలో కలిసే తీరప్రాంతంలో ఇవి విస్తరించి ఉన్నాయి.

మన రాష్ట్రంలో కృష్ణా-గోదావరి నదులు సముద్రాన్ని కావులించుకునే ప్రదేశాల్లో ఏర్పడే బ్యాక్ వాటర్స్‌లోను, ఆ నీళ్ళచుట్టు ఎదిగే అడవులను 'మడఅడవులు' అని అంటారు. వీటినే 'క్షారజల అరణ్యాలు' అని అంటారు. అంటే 'ఉప్పునీటి అడవులు' అన్నమాట.

కృష్ణాజిల్లాలో దీనదయాలపురం, సార్లగొంది, జింకపాలెం, నాలి, గొల్లల మొదలగు గ్రామాలకు ఆనుకొని, గుంటూరు జిల్లాలో రేపల్లె, నిజాంపట్నం మండలాల్లో ఉన్న నక్షత్ర నగర్, లంకెవాని దిబ్బ, కట్టువ, తాళ్ళది గ్రామాలను ఆనుకొని ఈ మడ అడవులున్నాయి.

తూర్పు గోదావరి జిల్లాలో వగడాలపేట, ఉప్పలంక, చొల్లంగి, రామెరిక, కొబ్బరిచెట్టుపేట, రామన్నపాలెం, కోరంగి, భైరవలంక మొదలైనవి. ఇవన్ని మత్స్యకారుల ఊర్లు ఈ జిల్లాలో 33 వేల హెక్టార్లలో ఈ అడవులున్నాయి.

ఈ అడవులు, చిట్టడవులు, నట్టడవులుకావు. ఇవి నీటి మీద తేలాడే అడవులు. క్రూర మృగాలకు బదులు చేపలు తిరిగే అడవులు.

ఈ బ్యాక్‌వాటర్స్‌లో మడ అనే మొక్క పెరుగుతుంది. కాబట్టి వాటికి ఆ పేరొచ్చింది.

**ప్రయాణం**

ఈమడ అడవుల్లోకి వెళ్ళి రావాలంటే ప్రత్యేకమైన ఏర్పాట్లు ఏమీలేవు. చేపలవారి నాటు పడవులు తప్ప.

కాకినాడ, తాళ్ళరేవు రూటులో సుమారు 15 కి.మీ. రోడ్డు మార్గాన వెళ్ళితే రామన్న పేట వస్తుంది. అక్కడదిగి మత్స్యకారులతో మాట్లాడుకొని పడవ మీద మడ అడవుల్లోకి వెళ్లాలి. విశాలమైన నదీపాయలో ప్రయాణం చేస్తూ కొంత దూరం వెళితే అడవిలోకి దారి తీయవచ్చు. పల్లెకారులకు తెలుసు కాబట్టి వారు తీసుకెళతారు.

నీటి పిల్లులు, నీటి కుక్కలు, చెట్లపై ఎలుకలు గూళ్ళు, పాములు దారి పొడుగునా కనిపిస్తాయి. ఇది ఒక సాహస యాత్రలా ఉంటుంది. మత్స్యకారులు పడవల మీద కాపురాలు చేయడం కూడా కనిపిస్తుంది.

**మడచెట్లు**

ఈమడ చెట్లు నీళ్ళలోపల ఎక్కడో వేళ్ళుఊరి. నీళ్ళపైన నడుముపైకెత్తి పచ్చగా కనిపించే ఈ చెట్ల సౌందర్యం, వీటిలేత వంగపూవుపూలు, వేలాడు కాయలు నయనానందకరంగా ఉంటుంది.

పల్లెకారులు మడ అనిపిలుస్తారు. దీనిలోని రకాలు, వాటి శాస్త్రీయ నామాలున్నాయి. అవి ఇలవమడ (అవిసేవియా ఆల్బా), తెల్లమడ (అవిసేవియా మెరేనియా), నల్లమడ (అవి సేవియా అఫిసినాలిస్). ఇవి 2 నుండి 10 మీటర్ల ఎత్తువరకు పెరుగుతాయి. ఇవన్నీ బలంగా పెరిగి ప్రకృతి కట్టిన దడిలాగ ఉండి తుఫాను అలలను, గాలులను ఇవి నిలువరిస్తాయి.

ఇక్కడ ఈ చెట్లే కాకుండా గుగ్గిలం, కంద్రక, తొగర, పొన్నచెట్లుకూడా పెరుగుతాయి. వీటి నుంచి రాలే ఆకులు అలములు ఈ బ్యాక్ వాటర్స్‌లోని చేపలకు చాలా ఇష్టమైన ఆహారం. అందుకని ఈ నీళ్ళలో చేపలు భాగ ఎక్కువగా ఉంటాయి. వీటిని పట్టుకొనేందుకు మత్స్యకారులు రోజులు, వారాలు తరబడి నీళ్ళమీదే, అడవుల మధ్యతిరుగుతూ వేట సాగిస్తుంటారు.

**శీతాకాలం**

మడ అడవుల్లో చేపలవేట శీతాకాలంలో అనువైనది మరియు లాభదాయకం. ఎందుకంటే వేసవి కాలంలో చేపలు పెద్దగా పడవు. వర్షాకాలంలో కొత్తనీరు చేరడం, లోతుపెరగడం వల్ల కూడా చేపలు దొరకవు. శీతాకాలంలో పిల్లలు, ముసలివాల్ళు ఊరిలో ఉంటే వయస్సులో ఉన్న ఆడ-మగా అంతానీటి మీదే జీవిస్తారు. కాకినాడ రేవులోనే చేపల అమ్మకాలు జరుగుతాయి.

**కట్టుబాటు**

కల్లెకారుల జీవితం దినదిన గండం. నీటిమీద బతుకు వారిది. వేటకు వెళ్లాక పడవలో కట్టుగా ఉండకపోతే ప్రమాదం. అందుకే వారు నాయకుడి మాటలింటారు. కట్టుబాట్లను పాటిస్తారు. నీటిమీద కూడా హద్దులుంటాయి. ఈ పల్లెవాళ్ళు ఈ హద్దువరకే వేటాడాలి. నదిలో ఇక్కడ వరకే వెళ్లాలి. సముద్రంలో ఈ వైపునే ఉండాలి. హద్దంటే హద్దే.

**దేవతలు**

వీరభద్రుడు, జలగన్నికి, అడవి సత్తెమ్మ, భైరవస్వామి, బానమ్మ మొదలైనవారంతా మత్స్యకారుల దేవతలు. సముద్రంలో కెరటాన్ని మత్స్యకారులు 'బాను' అనిపిలుస్తారు. అదే 'బానమ్మ' దేవత అయ్యింది. గ్రామం నుంచి వేటకు వెళ్ళేదారిలో ఒక కర్రపై చిన్న గూడు కట్టి దానిలో బానమ్మ విగ్రహం ఉంటుంది. వేటకు వెళ్ళే ముందు ప్రతి మత్స్యకారుడు దీనికి మొక్కి వెళ్ళాల్సిందే. బానమ్మ ఆగ్రహిస్తే ఊరంతటికి అరిష్టమని, వేటలో అపశృతులుంటాయని వీరి నమ్మకం. ప్రతి బెస్త ఊరిలోను రాముని ఆలయం ఉంది. దీనిని రచ్చబండలాగ ఉపయోగించుకుంటారు.

**శకునం**

శకునంమీద వీరికి అంతులేని నమ్మకం. ప్రతి గ్రామంలో అమ్మోరు పేరుతో ఒక స్త్రీ పూనకం తెచ్చుకొని శకునం చెబుతూ ఉంటుంది. ఆమె చెప్పింది తప్పకుండా జరుగుతుందని వీరి విశ్వాసం.

**ఫౌండేషన్**

మడ అడవుల సంరక్షణను స్వామినాధన్ ఫౌండేషన్ చేపట్టింది.

మడఅడవులు, పల్లెకారులు వేరువేరుకాదు. ఒకరిలో ఒకరు మమేకం అయి ఉంటారు.

# నియమ నిష్ఠలు

బ్రహ్మశ్రీ బొడ్డుపల్లి
పవన్‌కుమార్ అవధాని, గుంటూరు

**వరనియమవ్రత నిష్ఠాచరణ నియుక్తాంతరంగ సమధిక వైసం॥**
**భరిత తపోధన దాన, స్ఫురిత శ్రద్ధాను భక్తి పూర్వముగాగన్॥**

నీవు ఉత్తమ నియమాలతో, వ్రతాలతో నిష్ఠతో ఆచరించు నిగ్రహంతో కూడిన మనస్సుతో, నిండైన తపస్సు, శ్రద్ధాభక్తులతో కూడిన దానధర్మాలు ఆచరించు. ఈ పద్యం పోతనామాత్యుని ప్రణీతంబైన ఆంధ్ర మహాభాగవతంలోని మూడవ స్కంధములోనిది.

కర్దమ మహాముని దేవహూతితో పలికిన పలుకులివి. వేదాంతసారాన్ని విశ్వరహస్యాన్ని విజ్ఞానాన్ని అందించగల పుత్రుడిని ప్రసాదించమని దేవహూతి ప్రార్థించగా కర్దమ మహామునీంద్రుడు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే కపిలునిగా నీ గర్భవాసాన జన్మిస్తాడని, మహాదేవుడి జననం కావున నీవు నియమ నిష్ఠలతో, భక్తితో చరించమని అన్న సందర్భంలోనిది ఈ పద్యం.

ప్రతి గృహసీమయూ సకల సౌభాగ్యాలతో తుల తూగాలన్నా సప్త సంతానాలతో వర్థిల్లాలన్నా నియమలు నిష్ఠలతో కూడిన వ్రత విధానాలు అవసరమని ఋషి పుంగవులు అనాదిగా మనకందించిన గొప్ప సత్యం. వ్రత విధానాలు అంటే అవేవో కేవలం భగవంతుని అర్చనలు, పూజలు, ప్రసాద వితరణలు, వాయనాలు కానేకావు. అదొక జీవన విధానము. నియమ నిష్ఠలతో కూడిన దైనందిన జీవన విధానం. ఆశ్రమ ధర్మాలను తు.చ. తప్పకుండా పాటించడం, వ్యసనాలకు, వ్యామోహాలకు, దురల వాట్లకు దూరంగా వుంటూ, నిత్యనైమిత్తిక పూజా విదానాలతో, కర్మానుష్ఠానాలతో, సత్వగుణ సంపన్నులై ధర్మ జీవనాన్ని గడపటం కామ, క్రోధాదులను అదుపులో పెట్టుకుని తపస్వులుగా భాసిల్లగలగడం. శ్రద్ధాసక్తులతో కర్మలనాచరించాలన్న విషయాన్ని లోకానికి సందేశంగా ఇచ్చాడు కర్దమ మహామునివర్యుడు.

చదువుల్లో, వృత్తి ఉద్యోగాలో, చేసే ప్రతి పనిలోనూ శ్రద్ధాసక్తులు లేకుంటే అనుకూల ఫలితాలు రానేరవు. తరగతి గదుల్లో 40 మంది విద్యార్థులున్నారనుకుందాం. అందరికీ ఒకే రీతిగా మార్కులు రావుగదా! కొందరికి ప్రథమ శ్రేణివరిస్తే కొందరికి ద్వితీయ శ్రేణి కొందరికి అన్యశ్రేణి (తృతీయశ్రేణి) అలాగే కొందరికైతే అధమ శ్రేణి (ఫెయిలవడం). ప్రథమ శ్రేణి రాణించిన వారు ఏ పుణ్యం చేసివుంటారు ? అధమ శ్రేణి రాణించినవారు ఏ పుణ్యం చేసివుంటారు ? అధమ శ్రేణి (లేదా) నీచ శ్రేణి అనగా చదువుల్లో విఫలురైన వారు ఏం పాపం చేశారంటారు ? కారణం ఒక్కటే. శ్రద్ధాసక్తులే. తృప్తి కరమైన జీవన గమనానికి దానధర్మాలు ఆచరించడం ఎంతో ప్రధానం. దానమిచ్చే భాగ్యాన్ని కలిగివున్నందులకు సంతోషించాలి. అంతేగానీ దానశీలినని గర్వించరాదు. ప్రకటించు కోరాదు. ఎల్లప్పుడూ సర్వేశ్వరుని పట్లకృతజ్ఞత గలిగి వుందామన్న స్మరణకలగాలి. ఈ సుగుణసుమాలన్నీ ప్రతి గృహమందునూ విలసిల్లాలి. అప్పుడిక సాక్షాత్తూ ఆ జగదీశ్వరుడే ఆ ఇంటిలో, ఆ హృదయంలో కొలువై వుంటాడని తెలుసుకోవాలి.

ప్రొద్దున లేచింది మొదలు పరుగెత్తడమే మనిషి జీవితంగా మారిపోయింది గదా! మరి ఈ నియమాలు, నిష్ఠలు వ్రతాలు దానాలు ఎలా సాధ్యం ? అని ఎద్దేవా చేసుకోకూడదు మనకు మనం. ఒక్కసారి చరిత్ర

తిరగేయండి. ఎందరో మహానుభావులు - తమ 'పని తాము చేసుకుంటూ భక్తి రస సిద్ధులై వెలుగు చూపిన వారెందరులేరు చెప్పండి. కుటుంబ పోషణార్థం చిన్నాచితకా పనులే చేసుకుంటూ ఉన్నత శ్రేణి నాయకులుగా ఎదిగిన వారెందరు లేరు ? మనసుంటే మార్గం వుంటుంది. వేకువ ఝామునే లేచి స్నానాదులు చేసి, సంధ్యా వందనాది అనుష్ఠానాలు ఎలావీలు పడుతోంది ? వ్యాయామాలు అలవాటుగా ఎలా మారి పోయాయినేడు ? వికసించే జీవన విధానాలు ఆచరించడం మనవిధి. రాబోయే తరాలకు మనం మార్గ దర్శకులం కావాలి. జీవితాలు నందనోద్యాన వనాలుగా భాసిల్లాలి. శాస్త్ర, పురాణాలలో చెప్పిన వన్నీ నిత్య సత్యాలే. తెల్సుకోలేక పోవడం మన అవివేకం. తెలిసికొని ఆచరించగల్గితే ఈ భువి స్వర్గతుల్యమే.

---

తరువాయి 28వ పేజిలో......

**శ్లో॥ శ్రుతిస్మృత్యుదితం ధర్మమనుతిష్ఠన్హి మానవః।**
**ఇహ కీర్తి మవాప్నోతి ప్రేత్య చానుత్తమం సుఖమ్॥ (మను.2-9)**

'శ్రుతి, స్మృతులలో చెప్పబడిన విధ్యుక్త కర్మలను ఆచరించుట వలన మానవుడు ఈ లోకములో కీర్తిని, పరలోకములో సుఖములను పొందగలడు'.

శ్రీకృష్ణపరమాత్మ గూడ ఇదే అంశముపై భగవద్గీతలో విపులముగా విశదీకరించినాడు.

**శ్లో॥ శ్రేయాన్ స్వధర్మోవిగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్।**
**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః॥ (భగ. 3-35)**

'చక్కగ నాచరింపబడు పరధర్మము కంటె దోషముతో గూడిన స్వధర్మము శ్రేష్ఠమైనది. స్వధర్మాచరణమున మరణించుటయే శ్రేష్ఠము. పరధర్మము భయమును గలుగజేయును'.

శ్రీకృష్ణపరమాత్మ విధ్యుక్త కర్మాచరణమున శరీరము పోయినను జీవునికి అక్షయ సుఖము లభిస్తుంది. స్వర్గసుఖముల ననుభవింపగలవని చెప్పి, తనకు విధ్యుక్త కార్యమయిన యుద్ధమునందే అర్జునుని స్థిరుడుగా ఉండునట్లు చేసియున్నాడు. కాబట్టి చేయదగని కార్యమును వదిలిపెట్టి తనకు విధ్యుక్తమైన కార్యమును ఎట్టి పరిస్థితులలోను తప్పక ఆచరింపవలయును.

---

తరువాయి 33వ పేజిలో......

శంకరుని పరాజితులను జేసెను. సమస్త బ్రహ్మాండమును శాషించసాగెను. దేవతలను బందీలను గావించెను. ధర్మము నశించెను.

సమస్త దేవతలు కష్ట నివారణకు విఘ్నరాజుని పూజించసాగిరి. ఒక సంవత్సరము గడచిన తరువాత విఘ్నరాజు ప్రత్యక్షమయ్యెను. దేవతలు "ధర్మమునుద్ధరించు మనియు మమతాసురుని అత్యాచారముల నుండి విముక్తి లభింపజేయు"మని ప్రార్థించిరి.

విఘ్నరాజు నారదుని మమతాసురిని చెంతకు పంపెను. నారదుడు వానితో "నీవు అధర్మమును, అత్యాచారములను త్యజించి విఘ్నేశ్వరుని శరణువేడుము లేకున్న నీకు సర్వనాశనము తప్ప"దనెను. శుక్రాచార్యుడునూ ఇదే మాట చెప్పెను. అయిననూ మమతాసురుని అహంకారము తగ్గలేదు.

ఇది గ్రహించిన విఘ్నేశ్వరుడు ఉగ్రుడై తన చేతియందున్న కమలమును అసురుల ముందు విడచెను. కమల గంధముతో సమస్త అసురులు శక్తిహీనులై మూర్ఛపోయిరి. మమతాసురుడు కంపించుచూ విఘ్నరాజు చరణములపై బడెను. క్షమింపుము అని ప్రార్థించెను. విఘ్నేశ్వరుడు వానిని క్షమించి పాతాళమునకు పంపెను.

దేవగణములు విముక్తులై విఘ్నరాజుని స్తుతించిరి.

# వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు

డా॥ టి. చంద్రశేఖరం, తిరుపతి. 9701181966

**పానీయాలు :**

ఒక క్రొత్త కుండ యందు 15 తులాలు పటిక బెల్లం పొడి అందు సేరున్నర నీరు పోసి రెండు నిమ్మకాయల రసమును చేర్చి బాగుగా కలిపి ఆ కుండలో 4 చక్రకేళీ అరటిపండ్లు, 4 పనస తొనలు, ఒక మామిడి పండు ముక్కలు దానిలో వేసి సంధి బంధన చేసి పాత ధాన్యపు రాశిలో రెండు జాములు (6 గంటలు) నిలువ వుంచిన యెడల పానకమగును. దీనిని సేవించిన ఎడల దేహతాపము మనస్సంతోషము, దేహ బలము అభివృద్ధి యగును.

11. నేలవేము (భూనింభ) సమూలం ఎండబెట్టి చూర్ణం తీసుకొని రెండు తులాలు గ్రహించి 50 తులాలు మంచి నీటిలో వేసి 6 గంటలు నాననిచ్చి వడకట్టి పూటకు 8 తులాల చొప్పున 3 పూటలా యిచ్చుచుండిన ఎడల దేహమునకు బలం కలుగును. ఇది అజీర్ణము, అరుచిని పోగొట్టును.

12. వేపచెక్కను ఎండబెట్టి చూర్ణము చేసి పూటకు పావు తులం చొప్పుణ కొంచెం ఆవునేతితో తినుచుండిన శరీరమునకు బలము, పుష్టి కలుగును.

13. తిప్పతీగను మూడు తులాలు నీటిలో వేసి మూడు గంటలు నానబెట్టి వడకట్టి ఒక తులం దాసిన చెక్క చూర్ణమును అందులో కలిపి పూటకు 2 తులాల చొప్పున రోజుకు 3 పూటలా యిచ్చు చుండిన ఎడల శరీరమునకు బలము కలుగును. ఇది ఆకలి లేకుండుట, అజీర్ణము, జ్వరములయందు కూడ పనిచేయును.

14. పెన్నేరు గడ్డ (అశ్వగంధ) చూర్ణము చక్కెర, నెయ్యి కలిపి తినవలెను. దీనివలన శరీరపుష్టి కలుగును.

15. ఉసిరికాయలు, చింతపండు, నిమ్మకాయల రసం నీటితో సేవిస్తే శరీరానికి రోగం రాకుండా చేసే గుణం చాలా ఎక్కువగా వున్నది. ఆహారంతోకాని, విడివిడిగా గాని ఈ మూడింటిని రోజూ ఉపయోగిస్తూ వుంటే ఆరోగ్యము చక్కబడి ఆయువు పెరుగుతుంది.

16. మిరియాలపొడికి ఆరోగ్యాన్ని కాపాడే గుణం వుంది కూరలలో వీటిని వాడటం చాలా మంచిది. పిండివంటకాలలో కూడా కారానికి బదులుగా వాడితే ఆరోగ్యానికి మంచిది.

17. వెల్లుల్లి పాయలకు ఎముకలను బలపర్చే గుణం వుంది. ఎముకలు ఆరోగ్యంగా వుంటే మంచి రక్తము శరీరంలో ఉత్పత్తి అవుతుంది. ఇది ఆయుర్వృద్ధికి చాలా అవసరం. ఉదయం రెండు వెల్లుల్లిపాయలు, సాయంకాలం రెండు పాయలు గుజ్జు పచ్చిది తినాలి. ఆహారంతో కలిపి సులువుగా తినవచ్చును. ఎక్కువగా తింటే వేడి చేస్తుంది. కాబట్టి మితంగా తినాలి.

18. ఉల్లిపాయలలో క్రిమినిరోధక శక్తివుంది. సూక్ష్మక్రిములు ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. కాబట్టి పచ్చి ఉల్లిపాయ ఒకటి ప్రతిసారి మజ్జిగ అన్నంలో తినడం అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యానికి చాలా మంచిది. తెల్ల ఉల్లిపాయ కన్నా ఎర్ర ఉల్లిపాయలు మంచివి.

19. ఉసిరిక (నెల్లి) కాయలను నలగ్గొట్టి నీడలో ఎండించి గింజలు లేకుండా మెత్తటి పొడిచేసి ఆ చూర్ణంలో నెల్లికాయ రసం పోసి నానబెట్టి మరలా ఎండబెట్టి పొడిచేసి భద్రపరచుకోవాలి. అరగ్రాము చూర్ణమును 1 చెంచా తేనెతో కలిపి సమానంగా నెయ్యి చేర్చి రోజుకు 2సార్లు భోజనమునకు ముందు తీసుకొనుచుండిన 2-3 నెలల్లో శరీరం దృఢంగా పెరిగి బలం, రోగనిరోధక శక్తి కలుగును.